నమ్మలేని నిజాలు

కొత్త కూటమి
ఓట్ల కోటపై దాడి
శుభ సూచకం.

రెక్కల కారు
పక్షులు విలవిల
కాలుష్య నభం.

కృత్రిమ మాంసం
జీవహింసకు తెర
కొత్త రుచులు.

ఆషాడ మాసం
భక్తజన సందోహం
బోన నైవేద్యం

భూతల స్వర్గం
నగ్ననృత్యాల పబ్బు
అదొక గబ్బు



- రేడియమ్
సెల్: 9291527757

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

శ్రీనిజాలు

భిన్న సంస్కృతుల కలయిక
ఏర్పడే కూటములు !
భవిష్యత్తు భారతాన
ఎవరు గెలుపోటములు ?.

ఇరవైఆరు కూటముల
సొతు పోల్ భలే ఇడియా !
నార్త్ పోల్ ఎన్ డి ఏ మీద
గెలుస్తుందా 'ఇండియా' ?



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ గురువారం 20-7-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 269 పేజీలు:6 వెల: రూ.1/-


# ఉత్తరాదిని మళ్లీ వణికిస్తున్న వరద

న్యూఢిల్లీ, జులై 19: వరద ముప్పు నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న ఉత్తరాదిని మళ్లీ భారీ వర్షాలు వణికిస్తున్నాయి. హిమాచల్, ఉత్తరాఖండ్ సహా పలు రాష్ట్రాల్లో రెయిన్ అలర్ట్ జారీ చేయడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇక పోటెత్తిన వరదతో ప్రమాదస్థాయిని మించి ప్రవహించిన యమునా నదిలో నీటి ప్రవాహం ఇటీవల కొద్దిగా తగ్గుముఖం పట్టడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. పొరుగు రాష్ట్రాల్లో వర్షాలతో యమునా నది మళ్లీ 205.48 మీటర్ల నీటి ప్రవాహానికి చేరుకుని ప్రమాద స్థాయిని మించి ఉప్పొంగుతోంది.

గతవారం భారీ వర్షాలతో పాటు హరియాణలోని హథినీకుంద్ బ్యారేజ్ నుంచి నీటిని విడుదల చేయడంతో యమునా నది ఏకంగా 205.33 మీటర్ల ప్రమాదస్థాయిని మించి ప్రవహించింది. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు సహాయ పునారావస శిబిరాలను ఏర్పాటు చేశారు. వారం రోజుల పాటు వరద ముప్పుతో కంటిమీద కునుకు కరువైన ఢిల్లీ వాసులు మరోసారి ఉలిక్కిపడ్డారు. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో వర్షాలు కొనసాగుతుండటం, రెయిన్ అలర్ట్ జారీ చేయడంతో ఉత్తరాదిని వరద వణికిస్తోంది. ఈ నెల ఆరంభంలో కుండపోతతో వరద పోటెత్తడంతో ఉత్తరాదిలోని పలు రాష్ట్రాలు జలమయమయ్యాయి. పొంగి పొర్లుతున్న నదులతో బ్రిడ్జిలు కొట్టుకుపోవడంతో పాటు వాహనాలు సైతం నీటి ఉధృతికి కొట్టుకుపోయాయి. రోడ్లు, విద్యుత్ వ్యవస్థ సహా మౌలిక వసతులు దెబ్బతిన్నాయి. వంద మంది ప్రాణాలు కోల్పోగా కోట్లాది రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది.

# వ్యతిరేక కూటములు ఎప్పటికీ గెలవబోవు

## - ప్రతి పక్షాల ఇండియా కూటమిపై ప్రధాని నరేంద్ర మోదీ విమర్శల దాడి

న్యూఢిల్లీ జూలై 19 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: వ్యతిరేకతపై రూపొందించిన కూటములు ఎప్పటికీ గెలవబోవని ప్రతి పక్షాల ఇండియా (ఎ.ఔ.ఆ.ఎ.ం) కూటమిని ఉద్దేశించి పరోక్షంగా ప్రధాని నరేంద్ర మోదీ విమర్శల దాడి చేశారు. కూటమి కుటుంబ, అవినీతిపరమైనప్పుడు దేశం నష్టపోతుందని అన్నారు. ఇండియాకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని ప్రతిపక్షాలు చెబుతున్నాయి. కానీ పేదలు, వెనుకబడిన వర్గాలతో కూడిన భారత్ ఎన్డీయేతో ఉందన్నారు. ఎన్డీయే భేటీ అనంతరం ఆయన మాట్లాడారు. వచ్చే 25 ఏళ్లలో ఎన్డీఏ దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు."దేశంలో స్థిరమైన పాలన అందించడానికే ఎన్డీఏ కూటమి. అద్వానీయే ఎన్డీఏకు మార్గదర్శకులు. ఎన్డీఏను నిర్మించింది వాజ్‌పేయ్, అద్వానీయే. కూటమిలోకి కొత్త మిత్రులకు స్వాగతం. ఎన్డీఏ పట్ల అన్ని వర్గాల్లో విశ్వాసం ఉంది. దేశ ప్రగతిలో ఎన్టీఏ పాత్ర అత్యంత కీలకం. దేశంలో ప్రజా వ్యతిరేక కూటములు ఎప్పుడు సఫలం కాలేదు. కాంగ్రెస్ కూటమి ప్రజావ్యతిరేక కూటమి. ఆత్మనిర్భర్, భారత్ పురోభి వృద్ధి లక్ష్య సాకారానికి కృషి. దేశ ప్రజలు కొత్త సంకల్పంతో ముందడుగు వేస్తున్నారు. ఎన్డీఏకు కొత్త నిర్వచనం ఇచ్చిన ప్రధాని మోదీ. ఔ- న్యూ ఇండి యా, ఆ- డెలవప్‌నేషన్, ం- యాస్పిరే షన్ ఆఫ్ పీపుల్. అన్ని వర్గాలకు ఎన్డీ ఏపై పూర్తి నమ్మకం ఉంది. అందరి కృషి వల్లే దేశం అభివృద్ధి పథంలో సాగుతుంది." అని మోదీ అన్నారు. "ఎన్డీఏ హయాంలో 13.5 కోట్ల మంది దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు పైకి వచ్చారు. ప్రణబ్ ముఖర్జీకి భారతరత్న ఇచ్చిన ఘనత ఎన్డీఏది. విపక్ష పార్టీలు నన్ను నీచుడు అని నిందిస్తున్నాయి. ఎన్డీఏ కూటమి ప్రాంతీయ ఆకాంక్షలు నెరవేరుస్తుంది. ఎన్డీఏ కూటమిలో చిన్న, పెద్ద పార్టీలంటూ తేడా ఏం లేదు. గాంధీ, అంబేద్కర్, లోహియా సిద్ధాంతాలను ఎన్డీఏ ఆచరిస్తుంది. ఆదివాసి మహిళ ను రాష్ట్రపతిని చేసిన ఘనత ఎన్డీఏది. అవినీతిని అంతం చేసేందుకు అన్ని మార్గాలు ఉపయోగిస్తున్నాం. మేకిన్ ఇండియా నినాదంతో దేశాన్ని అభివృద్ధి చేస్తున్నాం. సమిష్టి కృషితోనే ప్రభుత్వాలు ఏర్పాడుతాయి. వంశపారంపర్య, అవినీతి పార్టీల కూటమితో దేశానికి నష్టం. ప్రభుత్వ ఏర్పాటు లక్ష్యంతో ఎన్డీఏ కూటమి ఏర్పాటు కాలేదు. మరొకరికి శత్రువుగా ఉండేందుకు ఎన్డీఏ ఏర్పాటు కాలేదు. స్థిరమైన ప్రభుత్వం వల్లే ప్రపంచానికి మనపై నమ్మకం పెరిగింది. ప్రతిపక్షంలో ఉన్నా విలువలతో కూడిన రాజకీయాలు చేశాం. రాష్ట్రాల అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యం. దేశ ప్రగతి నినాదంతోనే ఎన్డీఏ ముందుకు వెళ్తోంది. భవిష్యత్తులో ఎన్డీఏతో కలిసి వచ్చే పార్టీలను స్వాగతిస్తున్నాం. దేశం మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారబోతుంది. దేశ ప్రజల ఆకాంక్షల నెరవేర్చడమే మా అజెండా. దేశప్రగతి కోసం శక్తివంచన లేకుండా పని చేస్తున్నాం. నవ భారత నిర్మాణం ఎన్డీఏ లక్ష్యం. దేశం తలవంచుకునే పనులు ఎన్డీఏ ఎప్పుడూ చేయదు. నిబద్ధతతో ప్రజలు తల ఎత్తుకునేలా పాలన సాగిస్తున్నాం.'' అని మోదీ వెల్లడించారు.

# మహిళల ఆరోగ్య భద్రతకే రుతుప్రేమ-మంత్రి హరీశ్ రావు



సిద్ధిపేట, జులై 19 : మహిళల ఆరోగ్య భద్రత కోసమే ఈ రుతుప్రేమ కార్యక్రమాన్ని చేపట్టినట్లు రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు చెప్పారు. సిద్ధిపేట గ్రామీణ మండలం రాఘవాపూర్ ఎస్సీ ఫంక్షన్ హాల్ లో బుధవారం ఉదయం నిర్వహించిన రుతుప్రేమ కార్యక్రమానికి హాజరై మంత్రి మాట్లాడారు. ఈ రుతుప్రేమ గురించి ఇంట్లో సైతం మాట్లాడలేని పరిస్థితి, కానీ ఇవాళ బహిర్గతంగా మాట్లాడి చర్చించడం స్వాగతించదగిన విషయమని రాష్ట్ర మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. ఈ రుతు ప్రేమ కార్యక్రమంలో మహిళలం దరినీ సమన్వయ పరిచి భాగస్వామ్యం అయ్యేలా గుర్తించాలని ఆశా, ఏఎన్ ఎంలను రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు ఆదేశించారు.

ఇదో విభిన్నమైన కార్యక్రమం. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలలో విద్యావంతులుగా ఉన్నోళ్లు ఈ రుతుప్రేమ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని, పర్యావరణ ప్రేమికురాలు డాక్టర్ శాంతి దొరకడం అదృష్టం, ఓ వరంగా భావించాలని చెప్పారు. తోటి మహిళలకు సామాజికంగా తనవంతు సేవ చేయాలనే మంచి సంకల్పంతో సిద్ధిపేట పోలీసు కమిషనర్ శ్వేత సైతం ఈ రుతుప్రేమ కార్యక్రమానికి హాజరై అవగాహన కల్పిస్తూ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారని, దీన్ని మీరంతా అందిపుచ్చుకోవాలని కోరారు. ప్రతీ 10 మందిలో నలుగురు క్యాన్సర్ తో మృతి చెందుతున్నారని, క్యాన్సర్ అతి ప్రమాదకరమైన వ్యాధిగా వివరిస్తూ.. ప్లాస్టిక్ కాలుష్య కారక, ఔషధ ఆహారపు అలవాట్లతో క్యాన్సర్ వస్తున్నదని, ఈ దరిమిలా మీ ఆరోగ్యాన్ని కాపాడే ప్రయత్నం చేస్తూ.. ప్రతీ గ్రామంలో ప్రజా ఆరోగ్య ప్రయోజనార్థం స్టీల్ బ్యాంకు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.

నంగునూరు మండలంలో నిర్వహిస్తున్న రుతుప్రేమ కార్యక్రమానికి అనుకున్న లక్ష్యాన్ని చేరేలా మహిళలు హాజరవుతున్నారని, అదే తరహాలో సిద్ధిపేట గ్రామీణ మండలంలోని గ్రామ మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఒంటరి, వితంతు మహిళలకు కుట్టు శిక్షణ తరగతులు జరిపి, అనంతరం వారు స్వయం ఉపాధి పొందేలా కుట్టు మిషన్లు ఇప్పించే కార్యక్రమాన్ని తలపెట్టినట్లు మంత్రి చెప్పారు. నియోజకవర్గ పరిధిలో 3500 మంది మహిళలకు కుట్టు శిక్షణ, మిషన్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి పేర్కొన్నారు.

చెత్తను వేర్వేరుగా చేస్తే పరిశుభ్రతను పాటించినట్లుగా ఇళ్లు శుభ్రంగా నిలిపినట్లే, గల్లీ, గ్రామాన్ని శుభ్రంగా నిలిపితే ఎలాంటి అనారోగ్యాలు రావని మహిళలకు మంత్రి అవగాహన కల్పించారు. అనంతరం రాఘవాపూర్ గ్రామ మహిళలకు డాక్టర్ శాంతి, సీపీ శ్వేత, డీపీఓ దేవకిలు రుతుప్రేమ పై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ రోజాశర్మ, సిద్ధిపేట పోలీసు కమిషనర్ శ్వేత, డీపీఓ దేవకి, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




# యమున ఉగ్రరూపం

## – అగ్రా తాజమహల్ ను తాకిన వరద నీరు..



న్యూఢిల్లీ, జులై 19:భారీ వర్షాతో యమునా నది ఉప్పొంగుతోంది. యమున ఉగ్రరూపం దాల్చడంతో దేశ రాజధాని ఢిల్లీతో పాటు పలు ప్రాంతాలు నీట మునిగాయి. ఆగ్రాలో నది నీటి మట్టం 495.8 అడుగులకు చేరింది. ఈ క్రమంలో చారిత్రాత్మక కట్టడం తాజ్ మహల్ గోడలను యమున తాకింది. తాజ్ మహల్ ను యమున వరద తాకడం 45 సంవత్సరాల తర్వాత ఇదే తొలిసారి. 1978లో వరదలు వచ్చిన సమయంలో తాజ్ ను యమున తాకింది. తాజ్ మహల్ వెనకున్న తోటను యమున వరదనీరు ముంచెత్తింది.

తాజ్ కాంప్లెక్ బయటి గోడలను యమున తాకిందని ఆగ్రా సూపరింటెండెంట్ ఆర్కియాలజిస్ట్ రాజ్ కుమార్ పటేల్ చెప్పారు. చాలా ఏళ్ల తర్వాత ఇది జరిగిందని అన్నారు. అయితే తాజ్ స్మారక చిహ్నంలోకి వరద నీరు ప్రవేశించే అవకాశం లేదని చెప్పారు. మరోవైపు వరద వల్ల తాజ్ కు ప్రమాదం లేకపోయినప్పటికీ చుట్టు పక్కల ప్రాంతాలు మాత్రం ముంపుకు గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే ఆగ్రాలోని తనిష్క్, లోహియా నగర్, దయాల్బాగ్, రాజశ్రీ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆగ్రాలోని కైలాస మహాదేవ్ ఆలయ గర్భగుడిలోకి కూడా నీరు చేరింది. లొతట్టు ప్రాంత ప్రజలను అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించారు అధికారులు..

# మేడ్చల్ అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయేందర్‌రెడ్డి



హైదరాబాద్, జులై 19: మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా విజయేందర్‌రెడ్డి జిల్లా కలెక్టరేట్ లో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ఇప్పటి వరకు విధులు నిర్వహించిన నర్సింహారెడ్డి బదిలీ కాగా.. ఆయన స్థానంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ హోదాలో గజ్వేల్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)గా విధులు నిర్వహించిన విజయేందర్‌రెడ్డికి పదోన్నతి కల్పిస్తూ మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ మేరకు బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ గా విజయేందర్‌రెడ్డి బాధ్యతలను స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి చంద్రావతి, కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వర్లు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా వాణి బాధ్యతలు స్వీకరణ..

హైదరాబాద్, జులై 19:మీర్ పెట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా వాణి పదవి బాధ్యతలు చేపట్టారు ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న నాగేశ్వర్ రామగుండం బదిలీ కావడంతో స్థానంలో నాగారం మున్సిపల్ కార్పొరేషన్ నుండి మీర్పేట్ కార్పొరేషన్ కు బదిలీ అయ్యారు. భాద్యతలు స్వీకరించిన అనంతరం వాణి మాట్లాడుతూ కార్పొరేషన్ లో నెలకొన్న సమస్యలను దశలవారిగా పరిష్కరిస్తామన్నారు. కార్పొరేషన్ అభివృద్ధికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు

# శాంతి భద్రతల పరిరక్షణ తొలి ప్రాధాన్యం.. జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్

హైదరాబాద్, జులై 19: శాంతి భద్రతల పరిరక్షణ తొలి ప్రాధాన్యంగా పనిచేస్తానని జూబ్లీహిల్స్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ అన్నారు. ఇవ్వాల (బుధవారం) ఆయన ఏసీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అవినీతి, అక్రమాలపై ఉక్కుపాదం మోపుతానన్నారు. ప్రజలు ఏ ఇబ్బంది ఉన్నా నిర్భయంగా పోలీసు స్టేషన్ కు వచ్చి ఫొర్యాదు చేయాలన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానన్నారు ఏసీపీ హరిప్రసాద్. రౌడిసీటర్ల కు కౌన్సెలింగ్ ఇస్తూ, వారిని సన్మార్గంలో నడిచే విధంగా చూస్తానని చెప్పారు. నిత్యం పెట్రోలింగ్ చేస్తూ నేరాల నియంత్రణకు ప్రయత్నం చేస్తానని, చైన్ స్నాచింగ్ వంటివి జరగకుండా తమ సిబ్బందికి సూచనలు ఇస్తామన్నారు. జూబ్లీహిల్స్ ను ఆదర్శంగా నిలిపేందుకు ప్రజలు, నాయకులు సహకరించాలని ఆయన కోరారు.

## నేటి కందం– నేటికి అందం

కం॥ అందలమును నెక్కినట్లుగ
చందురుని స్పృశించినట్టి సంతోషమునా
చందురుడా ప్రజలందరు
"చందురుని దినోత్సవము"ను జరుపంగవలెన్!!

(జులై 20 మానవుడు చంద్రుడి మీద కాలుమోపిన రోజు..
ఈ రోజును జాతీయ చంద్రదినంగా జరుపుకుంటారు.
National Moon Day,..)



–రాధశ్రీ
సెల్:9494481210

# రాష్ట్రంలో ఊపందుకున్న వర్షాలు

## –ప్రాజెక్టులకు వచ్చిచేరుతున్న వరద నీరు

హైదరాబాద్ జూలై 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: వర్షాలు ఊపందుకోవడంతో రాష్ట్రంలోని ప్రాజెక్టులకు వరద నీరు వచ్చిచేరుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాలతో నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టుకు 4280 క్యూసెక్కుల వరద వస్తున్నది. జలాశయంలో ప్రస్తుతం 689.42 అడుగుల వద్ద నీటిమట్టం ఉండగా పూర్తి స్థాయి నీటి మట్టం 700 అడుగులు. ఇక స్వర్ణ ప్రాజెక్టుకు 890 క్యూసెక్కుల వరద వస్తుండటంతో 1164 అడుగులకు నీటిమట్టం చేరింది. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 1189 అడుగులుగా ఉంది. భారీ వర్షాలతో కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వరద ప్రవాహం కొనసాగుతున్నది. ఎగువ నుంచి 1500 క్యూసెక్కుల వరద వస్తున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు కాగా, ప్రస్తుతం 1388.32 అడుగుల వద్ద ఉన్నది. నిజామాబాద్ జిల్లా మాధవ్‌నగర్‌లో వరద ప్రవాహానికి బ్రిడ్జి కొట్టుకుపోయింది. దీంతో నిజామాబాద్–డిచ్‌పల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు వాహనాలను బైపాస్ రోడ్డు మీదుగా మళ్లిస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నది. ఎగువన భారీ వర్షాలతో ప్రస్తుతం 8.25 మీటర్ల ఎత్తులో నది పరుగులుపెడుతున్నది. ఛత్తీస్‌గఢ్‌లో వర్షాల వల్ల ములుగు జిల్లాలోని పాలెం వాగు ప్రాజెక్టుకు వరద పోటెత్తుతున్నది. దీంతో అధికారులు 4 గేట్లు ఎత్తి 6750 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో కురుస్తున్న భారీ వర్షాలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరద వస్తున్నది. దీంతో 21 గేట్లు ఎత్తి 49,244 క్యూసెక్కుల నీటిని అధికారులు గోదావరి నదిలోకి విడుదల చేశారు. కాగా, భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నది. ప్రస్తుతం 26.7 అడుగుల వద్ద ప్రవహిస్తున్నది. నీటి మట్టం మరింత పెరిగే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర జలవనరుల శాఖ హెచ్చరించింది,సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టుకి వరద కొనసాగుతున్నది. సింగూరు ప్రాజెక్టుకు ప్రస్తుతం 2847 క్యూసెక్కుల వరద వస్తుండగా, 405 క్యూసెక్కుల నీరు బయటకు వెళ్తున్నది. జలాశయం పూర్తి నీటిసామర్థ్యం 29.917 టీఎంసీలు. ప్రస్తుతం 18.640 టీఎంసీలకు చేరుకున్నది.

# ట్రాన్స్‌ఫార్మర్ పేలి 10 మంది మృతి.. ఉత్తరాఖండ్‌లో దారుణ ఘటన




న్యూఢిల్లీ, జులై 19:ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ పేలిన ఘటనలో 10 మంది మృతిచెందారు. అనేక మంది గాయపడ్డారు. జిల్లాలోని అలకనంద నదీ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో అకస్మాత్తుగా పేలుడు జరిగింది. గాయపడ్డవారిని జిల్లా ఆస్పత్రిలో చేర్పించినట్లు ఎస్పీ పర్మేంద్ర దోవల్ తెలిపారు. మృతిచెందిన పది మందిలో పీపల్‌కోట్ ఔట్‌పోస్టు ఇంచార్జీ కూడా ఉన్నట్లు ఉత్తరాఖండ్ డీజీపీ అశోక్ కుమార్ తెలిపారు.




# ఆవాహనం
మినీకథ



మొన్నవచ్చి ఊరూవాడల్ని ఏకం చేసి పారేసిన తుఫాను మరీ ఇంత దారుణంగా భయానకంగా ఉంటుందనుకోలేదు! ఆ దృశ్యం సుబ్బాచారిని కలవర పరుస్తూ ఉంది!! అంతేనా ఊరుకు ఒక ప్రక్కనున్న మాలపల్లెలోని అంబేద్కర్ విగ్రహం కూడ విరిగి పడిపోయింది.

'దారుణం యా కోబూ!' నా ఈ డబ్భై ఏళ్ళ జీవితంలో ఇంతగా ప్రపంచాన్ని దెబ్బతీసిన తుఫాన్‌ని చూడలేదు'

'అవును ఆచారిగారూ! ఈ ఉపద్రవంతో ప్రపంచమే తలక్రిందులయిపోతూ ఉంది. అందులో మనము, మన మాలపల్లె ఒక లెక్కా చెప్పండి!' యాకోబు మాటలు సుబ్బాచారిగారిని కలవర పెడుతూ ఉన్నాయి.

'ఈ రోజు ఖాళీగా, ఇంత మామూలుగా తమరు...'

'అవునయ్యా! విష్ణాలయంలో ధనుర్మాస కార్యక్రమాన్ని కొడుకు చూసుకుంటున్నాడు. నాకా వయసు పెరిగిపోతూ ఉంది. కాలం ఎప్పుడూ ఒకేలాగ ఉండదు కదా. వాడికీ దేవాలయంలోని అర్చకత్వ విషయాలని ఇప్పటి నుండి అలవాటు చేయకపోతే ఎలాగ చెప్పు!'

'తమరికి అవసరాలు ఏమయినా..' యాకోబు మాటలు సుబ్బాచారిగారికి నప్పుతాయి. అవడం తాను హిందువు. ఆయనగారు క్రిష్టియన్. అన్యమత స్థుడయినా అన్యత అనేది తమ నిఘంటువులో చూడలేదు తాను. ఈ ఒక్క మాలపల్లెలోనే యాకోబు, థామస్, దావీదు, సువర్ణమూర్తి, స్వతంత్రరావు తనను ఇన్ని సంవత్సరాలుగా చాల గౌరవంగా చూసుకుంటున్నారు.

అవడం ఒకే పేటలో మతాలు వేరయినా, ఆచార వ్యవహారాలలో, ఆహార అలవాట్ల లో సరిపోలికలు లేకపోయినా ప్రేమను పంచి ఇస్తూ ఉన్నారు.

తుఫాను పుణ్యమా అంటూ ప్రభుత్వం నడుం బిగించి అన్నింటినీ సరిచేస్తూ ఉంది. కానీ ఊరి మధ్యలో విరిగి వికృతంగా పడి ఉన్న అంబేద్కర్‌ని ఎవరూ పట్టిం చుకోవడం లేదు. ఆ విషయాన్ని సుబ్బాచారిగారే లేవనెత్తారు. అందునా మొదటగా ఐదువేలు విరాళం ప్రకటించారు.

'జల్లి అగ్రహారంలో పురాతన విష్ణాలయానికి పూజారివి. పోయి పోయి ఆ మాలపల్లెలో కాపురముం డడమేమిటి!' అప్పట్లో ఊరి పెద్దలు సుబ్బాచారిని నిలేశాయి.. నిలేస్తూనే ఉన్నారు. సుబ్బాచారికి ఆలోచిస్తే వింతగా అన్పిస్తూ ఉంది. కొన్ని దశాబ్దాల క్రితం స్వామివారి దేవాలయ అర్చకత్వానికి కుదిరి జల్లి అగ్రహారం తరలివచ్చాడు. అప్పటి నుండి తానొక చిన్న ఇంట్లో నివాసముంటున్నాడు. కాలానుగుణంగా ఊరు పెరిగిపోయింది. తమ ప్రాంతం మాలపల్లెకి దగ్గరయిపోయింది. అక్కడ అందరూ తనతో సయోధ్యగా ఉంటున్నారు. తమ చేతనయిన సహాయాన్ని అందిస్తూ ఉన్నారు. కానీ తన దేముణ్ణి నమ్ముకున్నాడు. విష్ణుమూర్తిని కొలుస్తూనే ఉన్నాడు.

అంబేద్కర్ విగ్రహ పునర్ ప్రతిష్ట కోసం ప్రయత్నాలు ఊపందుకుంటున్నాయి 'పంతు లుగారు మంచి మనసు చేసుకొని ముందస్తు విరాళం ప్రకటించారు. ఆ మహనీ యుని విగ్రహ ప్రతిష్ట గొప్పగా జరిగి తీరాల్సిందే! 'జల్లి అగ్రహారంలోని మాల పల్లె పెద్దలు పిలుపునిస్తూ ఉన్నారు. యువత నడుం బిగించి చందాల కోసం ముందుకు కదులుతోంది.

అనుకున్న సమయంలో విగ్రహం తయారయిపో యింది. విగ్రహ కమిటీ ఎంతో శ్రద్ధ తీసుకొని తయారు చేయించిన విగ్రహం చూడము చ్చటగా ఉంది. కానీ..

తమదైన ఆలోచనలతో దానికి అరుదైన రూపకల్పన చేయించారు. రాష్ట్ర సాంఘిక, సామాజిక సేవామాత్యుల చేతుల మీదుగా ఆవిష్కరణ చేయడాన్కి ఏర్పాట్లు జరిగిపోయాయి. అనుకున్న సమయానికి అమాత్యుల వారు విచ్చేసి విగ్రహంపైన కప్పిన ముసుగును తొలగించి అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించేశారు.

ఊరు వారందరికీ ముఖ్యంగా మాలపల్లె వాసులందరూ మమతల తీరాన ఓలలాడుతున్నారు. అంబేద్కర్ అంబేద్కర్‌గానే ఉన్నాడు. కానీ పరికించి చూస్తే ఆ మహనీయునిలో క్రొంగొత్త ఛాయలు కానవస్తూ ఉన్నాయి. అవి చూపరులను ఆశ్చర్య పరుస్తున్నాయి.

అందరూ పరికించి చూస్తున్నారు. తమ తమ దృష్టి కోణంతో సదా వీక్షిస్తూ ఉన్నారు. అవును.. జల్లి అగ్రహారం నడిబొడ్డున ప్రతిష్ఠింపబడిన ఆ జాతీయ నాయకుని ముఖారవిందంలో అంతర్లీనంగా సుబ్బాచారిగారి ముఖ కవళికలు కానవస్తూ ఉన్నాయి. మరింతగా పరికించి చూసినపుడు అది అంబేద్కర్‌లాగ అన్పించడం లేదు. తమ మధ్యనే ఉండి ఆదర్శవంతంగా బ్రతుకుతూన్న సుబ్బాచారి అనే అరుదైన సామాజిక కార్యకర్త ముఖారవిందం లీలగా గొచరిస్తూ ఉంది. తన్మయత్వంతో సుబ్బాచారిగారు ఆ విగ్రహంలో తనను తాను చూసుకుంటున్నారు. కనుల ముందు జీవన కాంతి విస్తృతమై వెలుగు లీనుతూ ఉంది.

పేటపెద్దలు తనమీద కురిపిస్తున్న ఆదరాభిమానాలతో చలించిపోతూ ఉన్నాడు. ఒక అలౌకికమైన ఆనందం వెన్ను తడుతూంటే, ఆ మహనీయుని జీవన క్రమాన్ని తనదిగా చేసుకోబూనుతున్నాడు.



–వదలి రాధాకృష్ణ
సెల్: 9985336444

## శ్రమయేవ జయతే

మట్టి పరిమలమద్దుకున్న శ్రమజీవి
చెమటధారలతో చక్రం తిప్పుతు
చరిత్ర పేజిలో నెత్తుటి అక్షరమై నీవు
తర తరాలకు
బాటలు వేస్తు సాగుతావు.

కంటి రెప్పల మాటున
దుఃఖాన్ని దాచి
పదిమంది కంచంలో మెతుకవుతావు
కల్మశమెరుగని మల్లె మనసు నీవు
కష్టమన్న పేరుకే
ప్రతి రూపమయ్యావు.

ఇనుప గొట్టాల పొగలో
కరుగుతు అలా
వెలుగు దీపమై ఎప్పుడు
మా బతుకు
జీవన పయనంలో తోడవుతావు.

గాయాలు గాధలు ...
ఎన్నెన్నో నిన్ను చుట్టుముట్టినప్పుడల్లా
శ్రమయేవ జయతే అంటు నినదిస్తావు.
కార్మిక కర్షక లోకం ఏకంచేస్తు
మును ముందుకు సాగుతావు.

సత్యం అహింస నీమార్గమై కదులుతు
నాగటి సాల్లలో మొలకవై మొలుస్తావు
వరిచెలలో వరికంకిలా
తలఎత్తు శిఖరమై
దిగంతాలకు నీ శ్రమను పంచుతావు.

శ్రమజీవి
నీకు వేలవేల వందనాలు
ఈ భూతల్లి సాక్షిగా
నీకు అడుగడుగున
మా హృదయపూర్వక చందనాలు!!



– వజ్జీరు ప్రదీప్
9989562991

## అమ్మ

వంటింటి ఆకాశంలో
పొగల మేఘాల మధ్య
సూర్యుడిలా పగలంతా
పని చేస్తుంది అమ్మ
చెమట చుక్కలు
కన్నీటి చుక్కల మధ్య
చందమామలా రోజంతా
నవ్వుతుంటుంది అమ్మ
పళ్ళాలు, చెంబులే
అమ్మను పలకరించే బంధువులు
వంక పెట్టని వంటలు చేయడమే
అమ్మ కోరుకునే బిరుదులు
ఉల్లిపాయలే తన
కన్నీరు తెలిసిన నేస్తాలు
చీర చెంగులే
తన బాధను పంచుకునే ఆప్తులు
అమ్మ ఒక మెజీషియన్
గరిట తిప్పిందంటే చాలు
ఘుమ ఘుమలాడే
వంటలు కళ్లముందుంటాయి
అమ్మ ఒక మ్యుజిషియన్
వంటింట్లో ఉందంటే చాలు
వంట పాత్రలు గాత్రం విప్పి
సంగీతం పాడుతాయి
అమ్మ ఒక పాడైపోయిన గడియారం
ఎంత కష్టపడి పని చేసినా
తన టైం ఎప్పుడూ తప్పుగానే కనబడుతుంది
అమ్మ ఒక పాత క్యాలెండర్
ఎన్ని మంచి శకునాలు చెప్పినా
ఏడాది చివరికి చెత్తబుట్టలో చేరే
కన్నీటిబొట్టవుతుంది
నాలుగు గోడల మధ్యే
కలల మేడలు కట్టుకొని
మూసిన తలుపుల లోపలే
తన తలపులను దాచుకొని
రెప్ప దాటని తన కల
ఒడ్డున పడిన చేపలా విలవిలలాడుతుంటే
ఫోటో ఫ్రేమ్ లో బొమ్మలా
అమ్మ జీవితం కదలిక లేకుండా ఉంటుంది
అది గుర్తించి మనం స్పందించేలోగా
గోడపై బొమ్మలా
అమ్మ వేలాడుతూ ఉంటుంది
మనం చేసిన తప్పును గుర్తుచేస్తూ కాలం
కర్కశంగా నవ్వుతూ ఉంటుంది



–డి.క్రాంతి కుమార్
7396721108

## ఒంటరి

కొందరు ఆమె కళ్ళలో కలువలకొలనులను చూస్తున్నారు
నేను కల్లోలసముద్రాలను చూస్తున్నాను,

కొందరు ఆమె సిగలో తుమ్మెదల మోహరింపును చూస్తున్నారు
నేను ధైర్యపుసెగలను చూస్తున్నాను.

కొందరు ఆమె కనుబొమల్లో హరివిల్లులను చూస్తున్నారు
నేను జవాబుల్లేని ప్రశ్నలవిల్లులను చూస్తున్నాను

కొందరు ఆమె నాసికలో సంపంగిపూవుని చూస్తున్నారు
నేను ఎక్కుపెట్టిన తుపాకీని చూస్తున్నాను.

కొందరు ఆమె చెవులలో తామరాకులను చూస్తున్నారు
నేను గాయపడ్డకందకాలను చూస్తున్నాను

కొందరు ఆమె ముఖంలో చంద్రబింబాన్ని చూస్తున్నారు
నేను నడుస్తు ఒక యుద్ధాన్ని చూస్తున్నాను!

ఒంటరి మహిళగా ఆమె ఓదార్పును కాదు
చూపులలో మార్పును కోరుకుంటున్నది!



– డా.కాసర్ల నరేశ్ రావు
9441406252

## నీ వల్లే

కర్మ చేసేవాడు ఒకడు
అనుభవించేవాడు వేరొకడు
చివాట్లు తినేవాడు ఒకడు
కీర్తినందే వాడొకడు.

మానవ మనుగడలో
సత్ఫలితం పొందితే తన గొప్పని,
చెడు అయితే ఎదుటివారి పైకి నెట్టేసే
తత్వం రాజ్యమేలుతోంది.

"నన్నే ఎందుకు అంటావ్"
అనే భావం
నరనరాల్లో పేరుకుపోయింది
గుండెల్ని పీక్కు తింటోంది

అయిన దానికి కాని దానికి
అనాదిగా దొరికే వార్ని,
అమాయకుల్ని పరుషంగా చివాట్లు పెట్టి,
మోదమందే కీచకులున్న సమాజంలో.

నన్నెందుకు ఆడిపోసుకుంటావని
కుటుంబ సభ్యులైనా, అప్తులైనా
తొలుత ధైర్యంగా ఎదిరిస్తే
గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టే.

తిరగబడనంత కాలమే ఆధిపత్యం
ఎదిరిస్తే గౌరవం గోవిందా! గోవిందా!.

ఎవరి జీవితానికి వారే కర్త, కర్మ, క్రియ
ప్రాప్తించే ఫలితానికీ వారే కారకులు.

పిల్లైనా గదిలో పెట్టి హింసిస్తే
కండ్లు పీకేస్తుంది కదా!

సదా అసహనంతో వినవస్తున్న
"నీవల్లే" అనే మాట అనే ముందు
"నిన్ను నువ్వు ముందు సంస్కరించుకో!"

–మహేంద్రాడ
సింహాచలాచార్య
9703483648

## ప్రకృతి పరవశం

వర్షపు చుక్క నేలను తాకిన క్షణం
నేలతల్లి పరవశం !
రవికిరణం సుదూర ప్రయాణంతో
నేలను తాకిన క్షణం
నేలతల్లి పరవశం !
జాబిల్లి వెన్నెలను పిండారబోసినట్టుగా
జాలువార్చిన క్షణం –
నేలతల్లి పరవశం !
రైతన్నలు 'విత్తు' నాటిన క్షణం
నేలతల్లి పరవశం !
ఆ చెట్లన్నీ ఫలాల నందించిన వేళ
మనమంతా పరవశం !
అప్పుడు ....ఆ
నేలతల్లి ఆనందం అనిర్వచనీయం !
వృక్షో రక్షతి రక్షితః



–న్యాలకంటి నారాయణ
9550833490

# అన్నదాతల జీవన చిత్రమే 'మట్టి బండి'





కవిత్వం జీవ కళ. జీవన స్పర్శ సోకనిదే అది రాణించదు. జీవితం కాచిన కవికే కవిత్వ కళను పుష్పింప జేయడం సాధ్యమవుతుంది. రైతుల వ్యధల్ని కాచి వడబోసిన కవి డా॥నాగ భైరవ ఆదినారాయణ గారి హృదయ స్పందన నుండి జాలువారిన మహత్తర దీర్ఘకావ్యమే 'మట్టి బండి'. కవి తాను అనుభవించే అంతర్గత సంఘర్షణల్లోంచి, అను భవాల్లోంచి రైతు బతుకు చిత్రము ను కవిత్వీకరించిన తీరు అద్భుతం, అమోఘం, అద్వితీయం.

"ఆకలి యే కవిత్వం"గా భావించే ఆదినారాయణ గారు కర్షక వ్యధల్ని 'మట్టి బండి' దీర్ఘ కవితలో ఏకరువు పెట్టారు. రైతు కవిత్వం పై ఎన్ని కావ్యాలు వచ్చినా స్వతహాగా రైతు అయిన ఆదినారాయణ గారు రైతువ్యధల్ని ఆర్తి, ఆర్ద్రతతో స్పృశించిన తీరు భిన్నమైనది, వైవిధ్యమైనది, విశిష్టమైనది విలక్షణమైనది. కవి తన కన్నీటి గాధలను అక్షరాలుగా పేర్చి అద్భుతంగా మలిచిన 'మట్టి బండి' కావ్యాన్ని రేఖా మాత్రంగా స్పృశిద్దాం!

**"మూడు తరాలపాటు**
**ముప్పుటలా**
**బువ్వ పెట్టి బతికించిన పొలంతో**
**బంధాలన్నింటినీ తెంపుకుంటూ**
**అమ్మేశాను"**

అంటూ కవి కావ్యారంభం లోనే రైతు ఆవేదనను ఆవిష్కరింప జేశాడు. చివరి వరకు ఆసరాగా ఉండాల్సిన పొలం అమ్మేయాల్సి రావడం రైతు గుండెను దహించి వేస్తుంది. పాఠకుల హృదయాలను పిండేస్తుంది. కావ్యానికి ఎత్తుగడే ముఖ ద్వారం వంటిది. ఈ కావ్యంలో ఎత్తుగడ నాటకీయంగా మొదలై పాఠకులను పరకాయ ప్రవేశం చేసేలా చేయడంలో కవి సఫలీకృ తలైనారు.

బిడ్డల వంటి ఎడ్లను అమ్మేసేట ప్పుడు రైతు పడే సంఘర్షణను వర్ణించిన తీరు "నభూతో నా భవిష్యతి" లా సాగింది. అంతేగాక ఎన్నోసార్లు తన కుటుంబాన్ని ఆదుకున్న బండిని అమ్మేస్తూ రైతు పడిన ఆవేదనను కవి ఆవిష్కరించిన తీరు అనన్య సామా న్యం. పొలం మీద అధికారం పోయి నప్పుడు రైతు ఆక్రందనను వివరించిన తీరు అనిర్వచనీయం.

**"ధాన్యపు బస్తాలతో**
**దండిగా ఉండే మెట్టు**
**పొయ్యి మీద కెక్కని**
**మట్టి చట్టిలా**
**వట్టి పోతుంది కాబోలు"**

పై పాదాలలో సిరిసంపదలతో తులతూగాల్సిన ఇళ్ళు ధాన్యం కరువై వట్టిపోతుంది కాబోలు అంటూ రైతు వాపోయిన తీరును 'కళ్ళకు కట్టినట్లు' చెప్పగలిగారు కవి. ఇలా చక్కని కావ్యాభివ్యక్తితో పాఠకులలో కుతుహలాన్ని రేకెత్తించారు.

కవి ఉబ్బలి వాగు, పరమేశుని కుంట జ్ఞాపకాల ఊటలో పాఠకులను తడిపిన తీరు ముచ్చట గొలుపుతుంది. కాపు పడుచుల వయ్యారాలు, బుడ్డోళ్ల దర్పం, వరసైన వారి చిలిపి కవ్వింలను హృద్యంగా చెక్కారు.

**"జొన్న వేసిన రోజుల్లో**
**లేత కంకులను తుండు గుడ్డలో చుట్టి**
**కర్రతో కొట్టి**
**ఊచ బియ్యాన్ని**
**ఊదుకుంటూ ఆరగించే వాళ్ళం"**

అంటూ జ్ఞాపకాల మధురానుభూతుల్ని చక్కటి వర్ణనలు, పోలికలతో శిల్పాన్ని పతాకస్థాయికి తీసుకెళ్లగలి గారు.

ఒకనాడు భారతదేశంలో రైతుకి దక్కిన గౌరవాన్ని చక్కటి ఉపమానాలతో శ్లాఘించారు.

**"నీరవ నిశ్శబ్దంగా ఉండే**
**బంజరు భూములకు**
**సప్తవర్ణాలను నైవేద్యంగా చేసి**
**హృద్యంగా మార్చగల**
**సేద్యగాడు"**

అంటూ బంజరు భూములను సైతం పంట భూములుగా మార్చి సేద్యం చేసిన రైతు విశిష్టతను కొనియాడాడు. కానీ ప్రస్తుతం వానలు చాటేయడంతో పంట పదును కాక మబ్బు చాటేసిన తీరును వివరించారు.

**"రైతు జాతకం ఏమిటో గాని**
**సేదాన్ని వర్షిస్తున్నా**
**వెూదానికి నోచుకోవడం లేదంటాడు"**

రైతు ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకొని శ్రమిస్తున్నా ఆనందానికి నోచుకోవడం లేదని కుమిలిపోయారు.

కావ్యంలో రైతుకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెద్దోడు ఉద్యోగం చేస్తున్నాడు. చిన్నోడు వ్యవసాయాన్ని నమ్ముకొని బ్రతుకీడుస్తున్నాడు. నాగలి పట్టిదున్నేవాడికి జీవితంలో పెండ్లి కూడా కష్టమే అంటూ వాపోయారు.

**"రైతు కుటుంబంలో పుట్టిన**
**యువతలు సైతం**
**రైతుతో పెళ్లంటే**
**పెదవి విరుస్తున్నారు"**

పై వాక్యాలు నేడు రైతు దయనీయమైన పరిస్థితికి అద్దం పడుతున్నాయి.

ప్రపంచానికి అన్నం పెట్టిన రైతుకి బువ్వ దొరికే పరిస్థితి లేదు. వ్యవసాయం 'కష్టనష్టాల అంప శయ్య'గా మారడంతో వ్యవసాయాన్ని విడిచి పెడుతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే ఆకలి చావులు తప్ప వేమో! అంటూ కవి హెచ్చరిస్తున్నారు.

**"హలో లక్ష్మణా**
**అంటూ అసువులు బాసే**
**ఆకలి చావులు**
**కనిపిస్తాయేమో**
**ఏమో!**
**ఏమో!"**

అంటూ కావ్యాన్ని ముగించారు. సాధారణంగా కావ్యం చక్కటి సందేశం తో ముగిస్తుంది కానీ ఇక్కడ సందేహంతో ముగించారు తద్వారా పాఠకుల ఊహకు వదిలేసి ఉత్తమ కావ్య శిల్పంగా మలచారు.

కావ్యంలో అడుగడుగునా అభివ్యక్తితో నవీనత్వం, శబ్దపద సౌందర్యం, భావుకత,అలంకార శబ్ద సౌందర్యం పాఠకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తాయి. నాగలి, గొర్రు, కర్రు,తంపట్లు,జడ్డిగంలాంటి వ్యవసాయ పారిభాషిక పదాలు పలకరిస్తాయి. కూటికుండ, కూటి దుత్త, మట్టి చట్టి లాంటి పదబంధాలు కట్టిపడేస్తాయి.

'మట్టి బండి' దీర్ఘ కవిత ప్రతి ఒక్కరి ఇంటిలో తప్పక ఉండి చదివి తీరాల్సిన కావ్యమని విశ్వసిస్తున్నాను.

**ప్రతులకు:**
డా॥ నాగభైరవ ఆదినారాయణ, 202
శ్రీ వెంకటసాయి రెసిడెన్సీ,
2వ లైను, రామయ్యనగర్, ఒంగోలు
ప్రకాశంజిల్లా- 523 002
సెల్: 9849799711



-వేణీ హజరత్
9848606573



పుస్తక సమీక్షలు

## ||పాట|| ప్రేమికుడు చిత్రం లో ఊర్వశీ ఊర్వశీ

పోలసీ... పోలసీ....తీసుకో ఓ పోలసీ
జీవితాంతం జీతం లాగా లాభం నీకూ పోలసీ
గెలుపు కీ సూత్రం మే ఎల్ ఐ సీ పోలసి
అందుకే....ముందుగా చేసుకో.. ఓ పోలసీ.

మిత్రమా తెలుసా తెలుసా..పోలాసీలకి పలు పేర్లు
అందులో...తగినది....ఏదో.....తెలుపు నాకు అది చాలు
గెలుపు కి సూత్రమే ఎల్ ఐ సీ పోలసీ
అందుకే...ముందుగా...తీసుకోఓ పాలసీ.

చిన్ని లైఫ్ కి చిన్నది అయినా చేసుకో పాలసీ
పిల్లల చదువుకు..మెల్లగా...ఇప్పుడే ప్రారంభించు...పాలసీ
కర్చులు కాస్త తగ్గించైనా కట్టుకో ఓ పాలసీ
దేవుడి కేసే ముడుపె అనుకుని మ్రొక్కుకో ఓ పాలసీ.

గెలుపుకు సూత్రమే ఎల్ ఐ సీ పాలసీ
అందుకే...ముందుగా తీసుకో ఓ పోలసీ
నేస్తమా నీ తరువాత నీవాళ్లకు నీడెవరు
నువ్వు అంటూ లేక పోతే నీ వాళ్లకి దన్ను ఎవరు
అందుకే ముందుగా తీసుకో ఓ పోలసీ
అండగా ఆక్షణం.అందుతుందా...పోలసీ.

చుట్టాలు చూసి వెలిపోతారే
చిరు సాయమేమి సరిపోవే
కన్నీళ్లు కష్టం తీర్చవుగా
కన్న వాళ్ళ ఆకలి తీరదుగా.

సమయమే మించి పోలేదు
సరియైన బీమా చేయించు
కలగన్న..కలలే సాధించి...అబయమే
వాల్లకి...కలిగించు.

జాబ్ కొట్టి జీతం పడగానే....టేక్ ఇట్ ఈజీ పోలసీ
ముసలి తనమే...ముంచెలోపే...టేక్ ఇట్ ఈజీ పోలసీ
చీకు చింత పోవాలంటే....టేక్ ఇట్ ఈజీ పోలసీ
నచ్చిన వాళ్ళే....మెచ్చాలంటే.... టేక్ ఇట్ ఈజీ పోలసీ.

పోలసీ... పోలసీ....తీసుకో ఓ పోలసీ
జీవితాంతం జీతం లాగా లాభం నీకు పోలసీ
గెలుపు కి సూత్రం మే ఎల్ ఐ సీ పోలసీ
అందుకే ముందుగా చేసుకో..... ఓ పోలసీ.

అనుభవంతో ఆలోచించు... ఇబ్బందులెపుడు మామూలే
చావుముందే చెప్పొస్తుందా....చెట్లకే...డబ్బులు కాస్తాయా
కుటుంబం క్షేమం ఆశిస్తే...కట్టు నిజంగా ప్రేమిస్తే
యంగులో చెయ్యని పోలసీ....
వంగాకా చేస్తే... ఏం లాభం.

## పేరడీ



-నీలం కృష్ణ మూర్తి
6303999199

## అంతర్జాల వలలో చిక్కి?!

నిజం చెప్పులు తొడుక్కోనే లేదు..
అబద్ధం భూమిని చుట్టేస్తున్న రోజులు
అరచేతిలో నరకమే తిష్ట వేస్తున్న వేళలు
మానవీయతనే హత్య చేస్తున్న యాప్‌లు !

గర్భం దాల్చక ముందే లింగ నిర్ధారణలు
జాతకం చూసి సిజేరియన్ ఆపరేషన్లు
నవజాత శిశువు పుట్టక పూర్వమే..
కుళ్ల కుట్లే అంతర్జాల వలల అకాలాలు !

తప్పుడు వార్తల్ని తక్షణమే విశ్వానికి చేరవేస్తూ..
పౌర సమాజన్ని బీటలు వారించే వార్తలు
నకిలీ కబుర్ల గరళం చిమ్మే స్మార్ట్‌ఫోన్ తెరలు..
నేటి అసామాజిక మాధ్యమ అసత్య వేదికలు !

జరగనిది జరిగినట్లు..
లేనిది కళ్ళ ముందున్నట్లు..
అసత్య ప్రచార సునామిని పోటెత్తించి ..
రెచ్చగొట్టే విద్వేష విషపూరిత ప్రసంగాలు !

విశృంఖల సామాజిక మాధ్యమ స్వేచ్ఛలు
లేని ముఖాన్ని ఉన్నట్లు చూపే ఫేస్ బుక్‌లు
వదంతుల తుఫానులో ముంచే వాట్సాప్‌లు
శాంతి కపోతాన్ని గాయపరిచే ట్విట్టర్ గూళ్లు !

సైబర్ నేరగాళ్ల అనైతిక అల్ప బుద్ధులు
నీచాతి నీచమైన యూట్యూబ్ పోస్టింగులు
సౌహార్ద భావనలకు చిచ్చుపెట్టే అరాచకాలు
ప్రపంచ ఐక్యతకు పొడుస్తున్నాయి తూట్లు !

ముఖ పుస్తకానికి ముక్కుతాడు వేసి..
పిట్ట గూటిని ప్రశాంత నిలయంగా మార్చి..
యూ ట్యూబ్‌లో పారే గరళాన్ని కడిగి..
వాట్సాప్‌కు లక్ష్మణ రేఖలు గీద్దాం !

సాలె గూడులో చిక్కిన దోమలా..
అంతర్జాల విష వలలో చిక్కిన జనులు..
ఇంటర్‌నెట్‌తో దూరాన్ని చెరిపి, కలిపి..
ప్రపంచ శాంతికి వేద్దాం పటిష్ట పునాదులు !



– డా॥ బుర్ర
మధుసూదన్ రెడ్డి
99497 00037

# 'మనోగతం' అనువాద కవితా మాలిక- గోళ్ళమూడి పద్మావతి







అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళనం, స్వర్గీయ డా॥ పోతుకూచి సాంబశివరావు సాహితీ మానసవర పుత్రికగా ఎందరో తెలుగు రచయితలకు, రచయిత్రులకు జాతీయస్థాయి గుర్తింపుగా అవార్డులు ప్రసాదింపచేస్తోంది. ఆ సంస్థ రాష్ట్రీయ అధ్యక్షుడు సతీష్ చతుర్వేది, హిందీ కవితా మాలిక "సత్యం శివం సుందరం" నుండి 18 ఆణిముత్యాల వంటి కవితలను ఎంపిక చేసుకొని ప్రముఖ కవయిత్రి గోళ్ళమూడి పద్మావతి 'మనోగతం, పేరిట తెలుగులో అనువాద కవితా మాలికగా ప్రచురింపచేయడం అభినందనీయం. 1996లో డా॥ సతీష్ చతుర్వేది రాసిన 'సత్యం శివం సుందరం' భారతీయ వైదిక తత్వాన్ని కవితా రూపకంగా ఆవిష్కరించి, ఆంగ్ల సాహితీ వేదికపై సుప్రసిద్ధి పొందింది. శ్రీమతి గోళ్ళమూడి పద్మావతి, ప్రచురింపచేసిన కవితలలో 'భారత మాతా వరమివ్వు', 'గణతంత్ర జ్యోతి వెలుగుతూనే ఉండాలి', 'జయభారత్', వంటి దేశభక్తి ప్రపూరిత భావనలను వ్యక్తీకరించే కవితలున్నాయి. "జనగణమనకు నూతన స్వరాన్నిచ్చే వరాన్ని యివ్వవలసినదిగా" కవి చతుర్వేది, భారతమా తను అభ్యరిస్తారు. ప్రపంచ తామసాన్ని అణచివేయగల భారత గణతంత్రజ్యోతి సదా ప్రజ్వరిల్లాలని కవి ఆకాంక్షిస్తారు. 'నా చిన్నతనం' కవితలో 'కొత్తగా విచ్చుకుంటున్న మొగ్గల పరిమళంలాంటి నాచిన్నతనాన్ని తీసుకురా గలిగితే 'ప్రేమ ఒక స్మృతి'లో నక్షత్రమై ఆకాశంలో కనిపిస్తావని ఆశించిన కవి, అసంఖ్యాక తారలను చూసి నిశ్చేష్టుడు కావడం, 'నిజంగా నువ్వే గుర్తొస్తున్నావు' కవితలో "నేను కవిని, నా కవితవు నువ్వు. మేఘాలలో దాగి ఉన్న మెరుపు మెరిస్తే నువ్వు కనిపిస్తావు" మృగనయని కవితలో "అరవిరిసిన పూదోట' చందమామ వెలుగు కిరణాలు', మంద సమీరాల వీవనలు', ఆ రూపసి ఏ దేవతో అంటూ కవి చతుర్వేది పరవశింపచేస్తారు. అద్భుతమైన భావ సౌందర్యం, తాత్త్విక స్పర్శ, హృదయానుగత అనుభూతి, ఆర్ద్రత, కవితా భావుకత ప్రతీకవితలో తెలుగులో అనువాద రీతిలో వ్యక్తీకరించడంలో కవయిత్రి గోళ్లమూడి పద్మావతి కృతకృత్యత సాధించారు. భారత్ భాషా భూషణ్ అవార్డు గ్రహిత, కవయిత్రి, కథా సాహితీ వివిధ ప్రక్రియల రచయిత్రి గోళ్ళమూడి పద్మావతి, హిందీ నుండి తేట తెలుగులో తెలుగుసేతగా వచనీకరించిన ఈ కవితా సంపుటి, డా॥ సతీష్ చతుర్వేది కవితా ప్రతిభకు అద్దంపట్టే విధంగా రచయిత్రి ప్రతిభావంతమైన కానుక అందచేసారు.

## అర్చనాంజలి





కవయిత్రి శ్రీమతి గోళ్ళమూడి పద్మావతి, డా॥ పోతుకూచి సాంబశివరావుగార్కి సాహితీ గురుదక్షణగా సమర్పించిన అర్చనాంజలిలో, నలభై అయిదు దైవభక్తి గీతాలు, నాలుగు దేశభక్తి గీతాలు ఉన్నాయి. సప్తస్వర సంగీత వైదుష్యంతో సాహిత్య సంబంధితంగా గేయ ప్రక్రియలో రాగ సమన్వితంగా 'అర్చనాంజలి' భక్తులను అలరిస్తోంది. గణపతి మేలుకొలుపు, అమ్మవారి ఆరాధన, రామనామ, కృష్ణలీలా సంకీర్తనలు, వేంకటేశ్వరుని పందొమ్మిది గేయార్చనలతో కవయిత్రి పద్మావతి చక్కటి గేయ సంపుటిని రూపొందింపచేసారు. దసరా వేడుకలలో అమ్మవారి గేయ రూప అర్చనలు విశేషంగా ఆకట్టుకొంటున్నాయి. దేశభక్తి గీతాలకు సంబంధించి, భారతమాతను ఆరాధ్యనీయురాలిగా, కీర్తించారు. నవ ఉగాది గీతికలో, కోయిల మధురగాన స్వరాన్ని, వాసంత సమీరాల ఆమనిని ఆహ్వానించారు. భక్త మహిళా బృందాలకు అర్చనాంజలి కొంగు బంగారం.

**ప్రతులకు:**
శ్రీమతి గోళ్లమూడి పద్మావతి
డి/501, సిద్ధంపెట్టి టవర్స్
జవహర్‌నగర్,
హైదరాబాద్-500 020
సెల్: 9618895543



-జయసూర్య
సెల్:9014948336

## సేవామూర్తులు



ఎల్లలెరుగని సేవలు
తెల్ల తెల్లని దుస్తులు
స్వచ్ఛమైన మనసులు
ప్రేమతో పిలుపులు
సాంత్వననిచ్చే పలకరింపులు
సూది వేయడంలో నేర్పరులు
మందులివ్వడంలో
సమయపాలకులు
నిత్యం రోగుల లాలనలో
తలమునకలు
పేదని పెద్దని ఉండవు తేడాలు
సేవల్లో చూడరు ఆడా మగా భేదాలు
రేయింబవళ్లు నిర్వర్తిస్తారు విధులు
వేళకు తినరూ
తాగరు అన్నపానీయాలు
కంటికి కనుమరుగౌను నిద్రాహారాలు
కన్నబిడ్డలే...
వారి దృష్టిలో రోగులు
తీయడానికి
వెనుకాడరు మలమూత్రాదులు
నిజంగా వారు
దేవుడు సృష్టించిన దూతలు
కంటికి రెప్పల్లాంటి అమ్మలు
ప్రతి ఆస్పత్రిలో కొలువైన నర్సమ్మలు!



–శర్మ సీహెచ్.,
సెల్:9440587567

పుస్తక సమీక్ష

# కాశీవరపు హృదయాంతరంగాలు

కవిత్వం అంతరాంతరాల్లో అలుము కున్న కారుచీకట్లను పారదరిమి ప్రకాశవంతమైన వెలుగు కిరణాన్ని ప్రసరింపజేయాలి. అసంకల్పితంగా గూడు కట్టుకున్న నిరాశా నిస్పృహల్ని బతుకు పొలిమేరల్లోంచి తన్ని తగిలేసి ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేయాలి. కుంచించుకుపోతోన్న మనుష్యుల మస్తిష్కపు మొక్కల్ని సారవంతమైన ఆలోచనల ఎరువులతో నింపి సస్యశ్యామలం గావించాలి..

కాశీవరపు వెంకటసుబ్బయ్య గారి కవిత్వం"ఎద మీటిన రాగాలు"సరిగ్గా అలాంటి స్ఫూర్తివంతమైన ఆలోచనల వైపు పాఠకుడ్ని ప్రేరేపించి , జీవితం పట్ల ఒక స్పష్టమైన అవగాహన కలిగిస్తుంది. అనేకానేక వ్యాకులతలతో మసకలు కమ్మిన మనస్సును ప్రక్షాళన గావిస్తుంది.






అంతేకాదు, ధారాళమైన ఆయన భాషా చాతుర్యం, విస్తారమైన ఆయన శబ్ద సంపద , పద్యం పద్యానికీ మనల్ని మంత్రముగ్ధుల్ని చేసి ఆకట్టుకుంటుంది!

ఆయన మొదటి కవిత "అగస్త్య భ్రాత" లో

**"అతని చిరునవ్వు దొంతర....**
**నా గుండె లోలోతున గతం పెట్టిన గాట్లపై**
**వీచిన శీతల తెమ్మెర లేపనం....**
**"అంటారు.**

**"జీవితం చివరి అంచు నుంచి....!"** అన్న కవితలో

**"హంస ఎగిరిపోయే సమయం**
**ఆసన్నమయ్యే కొద్దీ**
**శేషక్రియల పరిసమాప్తికి**
**వేగిరం సత్వరమవుతుంది"**

అంటూ చాలా చక్కని పదాల్ని పేరుస్తారు.

"దారి కాచిన ప్రమాదం". అన్న కవితలో

**"బయట మంచు తునకలు**
**గుండెల్లో నిప్పు కణికలు....**
**"సెలయేటి తుంపరుల్లా ఆలోచనా పరంపరలు**
**దేహపర్యంతం భీతావహ స్వేద బిందువులు..."**

"ఎండిన కొమ్ములపై గుడ్లగూబ
**కనుగ్రుడ్లు మిటకరిస్తున్న దృశ్యగతం...**
**"ఎక్కడి నుంచో దౌర్జన్యం పర్జన్యమై**
**పాంచ జన్యం పూరించిన ధ్వని నిర్ఘాతం."**ఇలా ఆయన కవితల నిండా అద్భుతమైన శబ్ద విన్యాసాలు మన కనులకు విందు చేస్తాయి.

అవి కేవలం శబ్దాలు మాత్రమే కాదు గొప్ప ప్రయోజనకరమైన అర్థాలను స్ఫురింపజేసే అందమైన వాక్యాలు.

ఆయనలో కవిత్వం ఏ క్షణాల్లో అంకురిస్తుందో కూడా "దృశ్యాదృశ్యాలు"అన్న కవితలో వివరిస్తారు –

**"పిల్ల తెమ్మెరలు మెల్లమెల్లగా ఆకుల సందుల్లోంచి**
**ఏపుగా ఎదిగిన వచ్చి గడ్డిని కదుల్చుకుంటూ నన్ను తాకినప్పుడు**
**నాలోని కవిత్వపు స్పృహ స్పర్శిస్తుంది"**
**"పెన్నేటి ప్రక్కన ఎత్తువారిగా వరసనిల్చిన**
**ఇసుక తిన్నెల సుందర రూపవిన్యాసం స్ఫురణకు వచ్చినప్పుడు**
**నిద్రాణంగా ఉన్న నాలోని కవిత్వం కనురెప్ప కదుల్చుతుంది"**

అయితే ఇలాంటి సాంప్రదాయక శబ్దాలతో మాత్రమే కాదు, చక్కని మాండలికంలో కూడా గొప్ప ప్రయోజనాత్మకమైన కవితలు రాశారు

"యాందిరా యిదీ ?" అన్న కవితలో గొప్ప మత సామరస్యాన్ని బోధిస్తారు

**"యాలగాని యాల**
**ఎవరన్నా మనింటికొచ్చే**
**కడ్పుసూసి ఆదరాబాదరా**
**బువ్వెట్టి కడ్పు సల్లబర్చినాం!**
**ఎండ పొద్దున దోవన పోయేటోళ్ళు**
**పోతాపోతా మనింటి వారపాక నీడకొచ్చే**
**మంచి నీళ్లకు బదులు మజ్జిగిచ్చి**
**సతాయించుకోమన్నాం!**
**మన పక్కింటోన్కి**
**ఏదో జబ్బొచ్చి ఆసుపత్రికి పోను**
**తిప్పలు పడ్తాంటే**
**నడిరేయ్యేనా బండికట్టి సాయం చేసినాం!**
**దర్గానో చర్చో గుడో కట్టుకుంటామంటే**
**తనామనాయని సూసుకోకుండా**
**సందాలిచ్చి పోత్సయించినాం!**
**ఇన్ని మంచి గునాలున్నోల్లం**
**ఇరిగింటోంతో సమచ్చలొచ్చే**
**ఒద్దికతో సర్దుక పోలేకుండాం!**
**పొరుగు కులమోన్ని కల్పుకొని**
**సావాసం చేయలేకున్నాం!"**

ఎంత గొప్ప మత సామరస్యం ఉంది ఈ కవితలో!

అలాగే , పొలం గట్ల దగ్గర ఒకరి భూమిని ఒకరు లాక్కోవటాన్నీ , ఒకరి కల్లందొడ్డిని మరొకరు కలుపుకోవటాన్నీ "మంచిది కాదన్నా"అన్న కవితలో –

**"ఇబ్బుడే సెబుతాండ ఇనుకోన్నా!**
**నువ్వీపని సేయడం తప్పన్నా!"**అంటూ...
**"పొరుగింటోని పెళ్ళాం సక్కగుందని**
**కన్నేయడం దురుమార్గమన్నా!**
**ఎనకింటోన్ని వేధించి ఏడిపించి**
**ఎల్లగొట్టడం న్యాయం కాదన్నా!**
**న్యాయం కోసం దగ్గరకొచ్చినోన్ని**
**నిందా ముంచడం ధర్మం కాదన్నా!....**
**నీ పద్ధతి మార్చుకోకుంటే నీకే ప్రమాదం అన్నా!**
**ముందే చెబుతున్నానని ఏమనుకోవద్దన్నా!"**
అంటూ హెచ్చరిస్తారు.

ఈయన వృత్తిరీత్యా ఒక రైతు. అందునా రాయలసీమ లాంటి దుర్భరమైన కరువు జిల్లాలో రైతు. అందువల్లనే సేద్యం గురించీ , దానిలోని సాదకబాధకాల గురించీ , సాగునీళ్ళు లేక అక్కడి రైతులు నిత్యం పడే యమ యాతనల గురించీ ఆయనకు క్షుణ్ణంగా బోధపడింది.

అందుకే "కరువు దావానలం" లాంటి గొప్ప కవిత రాయగలిగారు.

**"ఒకనాడు అన్నార్తులకు ఆకలి తీర్చి**
**సేదదీర్చిన పుడమి తల్లి**
**రత్నరాశులు విపణిలో అమ్మిన రత్నగర్భ**
**నేడు సస్యం సుదూరాలకు తరిగిపోతున్న వైచిత్రిక**
**క్షామం నిక్షేపంగా కనుచూపు మేర**
**విస్తరిస్తున్న దృశ్యమాలిక.**
**అదేమి చిత్రమోగాని ప్రకృతి కూడ**
**సీమపై కరుణ చూపదుగాక చూపదు**
**నైరుతి రుతుపవనాలు**
**సీమ భూభాగం దాటాకగాని వర్షింప నిష్టపడవు .......**
**ఆకాశం నిప్పుల వర్షాన్ని వడపోతగా కురుస్తుంది**
**నేలతల్లి ఒళ్ళు పగిలి నెర్రెలు పర్రెలు చీలుతుంది**
**చెట్లుచేమలు మలమలా మాడి**
**చీకట్లో భూతాలవుతాయి**
**తేమ భూగర్భంలోకింకి పోయి పాతాళ బిలం చేరుతుంది**
**పశుగ్రాసం అందక పశువులు**
**కబేలా వధ్యస్థలకి తరలి పోతుంటాయి**
**కూలినాలివాండ్లు పనులు దొరక్క**
**కాందిశీకులై దేశ్శోమంటూ దేశాలు పట్టుకుని వలస పోతారు**
**రైతన్నల చూపులు నింగికేసి నిశ్చల స్థితిలో నిల్చిపోతాయి**
**మేఘాలు దూది పింజల్లా దోబూచులాడుతూ**
**నాన్ స్టాప్ బస్సుల్లా ఎటో వెళ్ళిపోతాయి.**
.....
**జనం వర్షాలులేక పస్తులతో చస్తున్నా**
**నోటికి అందని కడుపు నిండని**
**వాగ్దానాలు ప్రణాళికలు మస్తుగున్నాయి**
**కృష్ణనీరు తీరాంధ్ర భూముల్ని పావనం చేస్తుంది**
**పెన్ననీరు నెల్లూరు సీమను సౌభాగ్యం చేస్తుంది**
**సీమకు మాత్రం కన్నీరు పుష్కలంగా మిగిలింది"**

ఎంత గుండె మండితే గాని, ఎంత హృదయ విదారమైన బాధను అనుభవిస్తే గాని ఇంత శక్తివంతమైన కవిత ఉత్పన్నం కాదు!

అందుకే , "మానవతా వాదాన్ని కూడా అధిగమించి సమస్త ప్రాణి సమానత్వ వాదిగా పరిణతి చెందాల్సివుంది" అంటూ నిర్ధారిస్తారీయన.

సహజంగా వ్యవసాయదారుడు కావడం వలన అనేక రకాలైన నేలల గురించి ఈయనకు బాగా తెలుసు. "ఏటిపై నీటి ప్రాజెక్టు" అన్న కవితలో ,

**"ఎండమావుల కింద**
**తొండలు గుడ్లు పెట్టే ఊసర క్షేత్రాలు**
**పొరగ్గంటల గరుకుభూములు**
**ఇసుకతెరప నేలలు ఎర్రమెట్ట పొలాలు**
**పోరంబోకు స్థలాలు చౌటి పర్రలు**
**బరకచేన్లు బీడుమళ్ళు నల్లరేగళ్ళు బంజర్లు"**

ఇలా, వివిధ రకాల భూముల్ని ప్రస్తావిస్తూ, జలాశయం నిర్మాణమైతే ఈ భూములన్నీ సస్యశ్యామలమౌతాయని ఓవంక హర్షం వెలిబుచ్చుతూనే, మరోవంక

**"ఊరూ గూడూ వదలి**
**పొలంపొత్రా పోగొట్టుకొని**
**ఆత్మీయతలు అల్లుకున్న సొంత ప్రాంతాలను విడిచి పెనవేసుకున్న అనుభవాలు అనుభూతులు**
**మమతలు మమకారాలు సమస్తమూమా**
**జలాశయంలో మునిగి**
**ఊరూవాడా పిల్లాజెల్లా అంతా**
**బోకులుబొచ్చులు నెత్తికెత్తుకొని**
**గుడ్డాగోదా తోలుకొని**
**కాందిశీకులై "పోలో"మంటూ**
**పరాయి దేశాలకు పయనమై**
**మానాభిమానాలు మంటగలసి**
**పరాయి జనం మధ్య బతికేస్తున్న"**

దుర్భర దురవస్థను ఎండ కడతారు.

ఇంకా ఈ పుస్తకంలో.... పచ్చ పచ్చని స్నేహ పరిమళాలున్నాయి. కడుపు చేత పట్టుకొని, "ఆకలి సాహస విన్యాసాలు" చేసే దొమ్మరి జీవుల కడగండ్లు ఉన్నాయి. బతుకు భయం దేహపర్యంతం ప్రాకి మరణోన్ముఖం అయిన మనిషికి ఎవరో తాత్వికుడు ఎదుటపడి బతుకు మంత్రమేదో చెవిలో ఊది గృహోన్ముఖం పట్టించిన శుభపరిణామాలు కూడా ఉన్నాయి.

నిజంగా ఇవన్నీ ఆయన ఎద ప్రియంగా మీటిన రాగాలుగానే మనకు కనిపిస్తాయి.

ఈ సంపుటికి ప్రముఖ కవి నందిని సిద్దారెడ్డి గారు ముందుమాట రాశారు. మరో ప్రముఖ కవి డా,, రాధేయ గారు రెండవ ముందు మాట రాయగా, మూడో ముందుమాటలో మరో ప్రముఖ కవీ , కథా రచయితా ఎమ్వీ రామిరెడ్డి గారు, ఈ కవితా సంపుటి సృష్టికర్త కాశీవరపు వెంకటసుబ్బయ్య గారిని చాలా లోతుగా అధ్యయనం చేసి "కవిత్వంలో నిలువీతలు కొట్టడానికి ఆయన తనను తాను సిద్ధం చేసుకున్నారంటూ చక్కని కితాబిచ్చారు.

మన చుట్టూ ఉన్న సమాజాన్ని ఇంత హృద్యంగా కవిత్వీకరించిన ఈ పుస్తకం పదిమంది చదవాలని నేను కూడా ఆకాంక్షిస్తూ..



**–పతివాడ నాస్తిక్**
9441724167

---

## అదేమిటో

ప్రతిభ...
ఒకరి సొత్తు కాదు
కొందరి సొత్తు కాదు
అందరి సొత్తు కూడా కాదు
ప్రతిభ...
ఎవరి దగ్గర ఉంటే
వారి సొత్తు
వారి సొంతం
ప్రతిభ..
ఉన్నవాడు నిండుకుండ
లేనివాడు ఓటికుండ.

**– శంకర వెంకట నారాయణ**
సెల్: 9959163676

## పాఠశాల

ముచ్చటైన చిలుక
ముద్దులొలుకు
పలుకులు మాకిష్టం.

అందమైన నెమలి
కనువిందు చేయు
నృత్యాలు మాకిష్టం.

గానాల కోయిల
తీయనైన గొంతుక
రాగాలు మాకిష్టం.

వాన చినుకులు
చిటపటతో రేపు
మట్టివాసనలు మాకిష్టం.

లేగ దూడలు
సందడి చేయు
గెంతులు మాకిష్టం.

చిన్నిపాప పాదాలు
గజ్జెలు చేయు
సవ్వడులు మాకిష్టం.

ఆట,పాటలతో
అందరిని అలరించు
పాఠశాలలు మాకిష్టం



**–కయ్యూరు బాలసుబ్రమణ్యం**
7780277240

## ఎదురీత

తగని రోగమొచ్చి
తల్లడిల్లుతున్న తనువు
తగిన వైద్యంలేక
తరుగుతున్న ఆయుష్షు.

బాధ్యతల బండికి
విరామం లేకుండా
ఇంధనం అందిస్తున్నా
ఇరుగు పొరుగు వారి
దరిదాపులోకి చేరలేక
మొరాయిస్తున్న ఇంజన్.

కళ్ళు మూస్తే పీడ కలలు
తెరిస్తే తీరని కష్టాల తెప్పలు
తీరం చేరే మార్గం లేక
తీరొక్క తిప్పలు.

ధైర్య వచనాలు
దైవ దర్శనాలు
యెదలోని బాధల్ని
ఏకరువుపెట్టి
ఎగతాళి కావొద్దంటూ,
ఎదురీతే ఏకైక మార్గమని
సర్దిచెప్పుచున్నవి..



**–బస్వ రాజ్ కుమార్**
9392006080

## నాగన్న పదాలు

గుడిని కట్టించాను
బడిని కట్టించాను
"దోపిడి" మరువలేను
ఓరి! నాగన్న.

చెత్త చెడ్డది కాదు
చేను చెడ్డది కాదు
"కాయమే" పనికిరాదు
ఓరి! నాగన్న.

వేయరా పద్మాసన
చేయరా అభ్యాసన
వ్యాధులే! నిర్మూలన
ఓరి! నాగన్న.

అడవుల నరికివేత
అవనికే ఉరి తీత
మనిషి మనుగడ రోత
ఓరి! నాగన్న

కేంద్రానికి కళ్ళు
కల్లాలపైనే కుళ్ళు
రైతులకు సంకెళ్ళు
ఓరి! నాగన్న.

పరుగుల విమానాలు
కడు ప్రమాదాలు
చేష్ట లుడిగి జనులు
ఓరి! నాగన్న.

కోరికలే గుర్రాలు
వినసొంపు స్వరాలు
రవాణకు సముద్రాలు
ఓరి! నాగన్న.

నదులుండగా ఎడారి
వనరు లుండి సోమరి
దేశ మేల భిఖారి
ఓరి! నాగన్న.

దట్టమైన అరణ్యాలు
జంతు నివాస గుహలు
పోదు వలన బయళ్లు
ఓరి! నాగన్న.

అడవులు అంతరించె
పులులే సంచరించె
ప్రాణ భయాలు పెంచె
ఓరి! నాగన్న.

అందమైన నెమళ్లు
పరుగుల కుందేళ్లు
అడవి ఒక పొదరిళ్లు
ఓరి! నాగన్న.



**–నెమలికొండ నాగేశ్వర్ రావు**
8688553470

---

పుస్తక సమీక్ష

# సమాజాన్ని సున్నితంగా ప్రశ్నించే వ్యాసాలు, నిజాలను నిగ్గు తేల్చాలని సంధిస్తున్న లేఖా వ్యాసాలు.




"సగటు మనిషికి న్యాయం అందుబాటులో లేనప్పుడు, ఎన్ని చట్టాలు చేసినా ఉపయోగం లేదు . నీతులు , సూక్తి ముక్తావళులు చెప్పడం మానేసి , ముందు మనం, ఆ చెప్పే వాటిలో కొన్నయినా పాటించి , అప్పుడు చెప్తే మన మనస్సాక్షికి మనం సమాధానం చెప్పుకోగలం ."

ఇలా నిరభ్యంతరంగా తనలోని భావాలను , ఎవ్వరేమనుకున్నా నాకేంటి?.

నే వ్రాయాలని అనుకుంటున్నది వ్రాస్తూవుంటా.

"నిజాలను నిర్భయంగా ప్రకటించడంలో, నా స్వేచ్ఛను ఎవరి మెహర్బానీ కోసమో, కొల్పోలేను".

అని చెప్పగల కవయిత్రి "మంజు యనమదల" గారు.

ఇలా ఎన్నో విషయాలపై తనదైన శైలిలో, వ్యవస్థలోని అనేక విషయాలను, లోతుగా విశ్లేషిస్తూ వ్రాసిన వ్యాసాలను "అవ్యక్తం" లేఖావ్యాసాలు పేరుతో పుస్తక రూపంలోనికి తీసుకు రావడం హర్షించదగ్గ విషయమని చెప్పుకోవ చ్చును.

వ్యక్తపరచాలి అనుకున్నది ,వ్యక్త పరచలేనిదీ.

తెలుసుకున్నది, నలుగురితో పంచుకోవాలనే తపనకు మూలం, అవ్యక్తం లేఖావ్యాసాలు పుస్తకం.

మనిషిలోని పది రాక్షస దుర్గుణాలు పై విజయం సాధించగల శక్తినిచ్చేది అక్షరం మాత్రమేనని.

అనేక మనస్తత్వాల సముదాయమే సమాజం.

సమాజాన్ని దగ్గరిగా చూపించగల శక్తి అక్షరానికి మాత్రమే ఉంది. అని మరోసారి ఋజువు చేసారు "కవయిత్రి మంజు యనమదల" గారు.

వ్యక్తపరచ గలిగిన భావాలను, అక్షరబద్ధం గావిస్తూ అనేక వ్యాసాల రూపంలో, మనకు అందించిన అమూల్యం ఈ అవ్యక్తం లేఖా వ్యాసాలు. నేడు ప్రతి ఒక్కరూ చదవ వలసిన పుస్తకం.

ప్రతి ఎదలోని ప్రశ్నకు సమాధానం దొరుకుతుంది.

వ్యవస్థను ప్రశ్నించాలి అనుకునే వారికి, ఎందుకు ప్రశ్నించాలో వివరించగల పుస్తకం అవ్యక్తం.

నేటి సమాజాన్ని అధ్యయనం చేస్తూ, మనిషి అంతరంగాన్ని శోధిస్తూ, సమగ్ర పరిశోధనాత్మక వ్యాసాలను పొందుపరిచిన ఈ పుస్తకం ప్రతి ఒక్కరూ చదివి తీరవలసిందే.

అందుకు రచయిత్రి ముందు మాటలే బలం చేకూరుస్తాయి. వారి మాటల్లో

**"ఎవ్వరు ఏమనుకున్నా నేను చెప్పాలనుకున్నది వ్రాయడం. నా మనసు చెప్పినట్లు వ్రాయడమే నాకు అలవాటు, లెక్కలు కోసమో మరిదేనికోసమో నేను రచనలు చేయడం లేదు ..నా మనసులోని భావాలను వెల్లడిస్తున్నాను"** అంటారు రచయిత్రి..

**"ఎవ్వరు ఏమనుకున్నా నేను చెప్పాలనుకున్నది వ్రాయడం. నా మనసు చెప్పినట్లు వ్రాయడమే నాకు అలవాటు, లెక్కలు కోసమో మరిదేనికోసమో నేను రచనలు చేయడం లేదు ..నా మనసులోని భావాలను వెల్లడిస్తున్నాను"**

స్వలాభాపేక్ష లేని ఇటువంటి రచనలను తెలుగు సాహిత్యం స్వాగతిస్తుంది అలా సాహిత్య రంగంలో నిలిచిపోగల రచనలు ఎంతో ఓపికతో మనకు అందించిన మంజు యనమదల అమ్మకు హృదయ పూర్వక అభినందనలు.

నిజమైన ప్రతిభకు గుర్తింపు తక్కువే అనే వాస్తవాన్ని "వ్యవస్థకు కావాల్సింది వ్యక్తిత్వం కాదు. విలువలు కాదు. వ్యక్తిగా గుర్తింపు మాత్రమే . ఆ గుర్తింపు అధికారం,బలం,ధనం వలన వస్తుంది . అనే సూటి మాటల్తో సమాజాన్ని పోస్టుమార్టం చేసి నిజాలేవో చూపించారు . అర్హత అనే వ్యాసంలో.

కొన్ని వందల ప్రశ్నలకు సమాధానం ఒక్కోసారి మౌనం మాత్రమే. కొన్ని దశాబ్దాల మౌనం విస్ఫోటనం చెందితే వెలువడేది అక్షరవ్యాసం అనేది వాస్తవం అంటాను నేను..

ఎన్నో ప్రశ్నలకు.. సమాధానాలు ఈ వ్యాసాలలో రచయిత్రి పొందు పరిచారు. సమాజాన్నీ అధ్యయనం చేయాలనుకునే ప్రతి ఒక్కరికి చక్కటి గైడ్ లైన్ వంటిదే ఈ పుస్తకం అనిపిస్తుంది.

నేడు ఆర్థిక అసమానతల్తో కునారిల్లుతున్న వ్యవస్థలో బంధాలకు, అనుబంధాలకు మధ్య జరిగే మనిషి ,మానసిక సంఘర్షణ, వాటి పర్యవస్థానాలు చక్కగా వివరించిన వ్యాసాలు.

అదే విధంగా నేడు ప్రపంచాన్ని తన అధీనంలోకి తెచ్చుకున్న టెక్నాలజీ, వాట్సాప్, ఫేస్ బుక్, ఇన్స్టాగ్రామ్, వంటి వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలో,వాటిని విజ్ఞాన సంపార్జనకు వినియోగించుకోవాలనే సందేశాను అందించిన వ్యాసం చాలా విలువైనది.

నే చెప్పేదేంటంటే.. వ్యాసంలో..

"సగటు మనిషికి న్యాయం అందుబాటులో లేనప్పుడు, ఎన్ని చట్టాలు చేసినా ఉపయోగం లేదు . నీతులు , సూక్తి ముక్తావళులు చెప్పడం మానేసి , ముందు మనం, ఆ చెప్పే వాటిలో కొన్నయినా పాటించి , అప్పుడు చెప్తే మన మనస్సాక్షికి మనం సమాధానం చెప్పుకోగలం ."

రాజరిక వ్యవస్థ కనుమరుగై ప్రజాస్వామ్యం విరాజిల్లుతున్న రోజుల్లో..

రంగులు మార్చే రాజకీయ వ్యవస్థను చూస్తూ అక్షరాలను తూటాలుగా మలిచిన విధానమే లేఖావ్యాసాలు.

నేటి సమాజంలోని కొందరి ప్రవర్తనను ప్రస్తావిస్తూ.

"వల్లమాలిన ప్రేమలు కురిపిస్తూ , లోపల విషపు సెగ విరజిమ్మే నైజాలిప్పుడు మన చుట్టూ చాలా ఎక్కువే,

మనం జాగ్రత్తగా మసలుకోవాలి . ఈ నటనలే అగ్రస్థానాన్ని ఆక్రమిస్తున్నాయి . చూసి చూసి మనకూ నటన అలవాటై పోతుందేమోనని భయము వేస్తోంది ఓ పక్కన "అంటారు రచయిత్రి.

**"రెప్పపాటు ఈ జీవితానికీ ఎన్ని రెప్పలు కింద కన్నీటిని పారించాలో , శత్రువును తలుచుకున్నంతగా, మిత్రులను కూడా తల్చుకోం కొన్ని బాధ్యతల నడుమ బంధాలకు చోటు తక్కువే మరి"** అనే వాస్తవాన్ని నిర్భయంగా ప్రకటించడంలో , రచయిత్రి ఎదుర్కొన్న ఎన్నో పరిస్థితిల ప్రభావం కావచ్చు.,.

ఇలా ఎన్నో విషయాలపై,అనేక కోణాల్లో తనదైన భావాలను ప్రస్ఫుటంగా ప్రకటిస్తూ, మనకు అందిస్తున్న లేఖావ్యాసాలు. **"అవ్యక్తం లేఖావ్యాసాలు"** పుస్తకం తప్పక చదవండి.

మనం స్పందించలేని,మన మనసులో గూడుకట్టుకున్న ఎన్నో ప్రశ్నలను సూటిగా, ప్రశ్నించే తత్వాన్ని స్వాగతిద్దాం రండి.

**ప్రతులకు:**
–మంజు యనమదల
9490769585



**–రాము కోలా**
9849001201.

---

# ప్రాణం నిలబెట్టిన స్నేహితులు.. (కథ)

ఇంటిముందు అరుగుపై కూచుని తరగతిలో చెప్పిన పాఠాలు నెమరువేసుకుంటున్నారు. రవి, శివలు.

వాళ్ళ టీచర్ ఇంటిముందుకు వచ్చి ఏరా రవి? అంటూ పిలిచి ఏమి చేస్తున్నారు అని అడిగాడు టీచర్.

చదువుకుంటున్నాం సర్ అన్నాడు రవి.

కూచోండి సర్ అన్నాడు శివ.

రవి ఇంట్లోకి వెళ్లి వాళ్ళ అమ్మతో సర్ వచ్చిండు అమ్మ. కూచోబెట్టిన అని చెప్పగా సరే సర్ కు చాయి తీసుకొస్తా. నువ్వు పోయి సర్ తో మాట్లాడుపో అని పంపింది అమ్మ.

కొద్దిసేపయినాక చాయి తెచ్చింది అమ్మ.

ఎందుకమ్మా ఇవన్నీ ఇట్ల దారిలో పోతుంటే పిల్లలు కనిపిస్తే ఏమి చేస్తున్నారో చూద్దామని వచ్చిన అన్నడు సర్.

చాయి కదా సర్ తాగుండి అని చాయ్ గ్లాస్ అందించింది అమ్మ.

పిల్లలు బాగా చదువుతున్నరు. పెద్దయితే వాళ్ళ అనుకున్నది సాధిస్తారు అన్నాడు సర్.

అంతా మీరు నేర్పే విద్యనే కదా సర్ అన్నది అమ్మ.

చాయ్ తాగి బాగా చదివి మంచి ఉద్యోగాలు చేయాలి అని చెప్పి సరే వస్తా అమ్మ, అని చెప్పి పోయిండు టీచర్.

ఎదులాబాద్ అనే ఊరు. ఆ ఊళ్ళో అందరూ ఆప్యాయతతో కలిసి వుంటారు. ఎవరి వృత్తి పనులు వారు చేసుకుంటూనే సుఖదుఃఖాల్లో ఒకరికొకరు తోడు నిలుస్తారు. పండుగలు పబ్బాలు కలిసి చేసుకుంటారు. మోహర్రం, రంజాన్, దసరా, వినాయక చవితి, దీపావళి ఏ పండుగైనా అన్నదమ్ముల్లాగా ,అక్కచెల్లెళ్ళలాగా కలిసి చేసుకుంటారు. బోనాలు బతుకమ్మ పండుగ వస్తే ఊరంతా సందడి. నిండు కుండలాగా వుండే చెరువుఒడిలో బతుకమ్మలు ఒలలాడుతూ ఆనందంలో తెలియాడుతవి.

కులాలు వేరైనా రవి, శివ మంచి స్నేహితులు. వారి ఇళ్లు కూడా పక్కపక్కనే ఉంటాయి. ఇద్దరు ఆరవ తరగతి చదువుతున్నారు. బడి అయిపోగానే ఇంటికి వచ్చి అమ్మ చేసిపెట్టిన అప్పలు తిని హోమ్ వర్క్ చేసుకుంటారు. టీచర్ చెప్పిన పాఠాలు ఇద్దరు కలిసి చదువుకుంటూ చర్చించుకుంటారు.

పల్లెటూళ్లలో పిల్లలు అమాయకులు. స్నేహానికి ప్రాణం ఇస్తారు.

పెద్ద గుడి దగ్గర కోనేరు ఉంది. అందులో నీళ్లు నిండుగా ఉన్నవి. ఎండాకాలం సెలవుల్లో వాళ్ళ నాన్నలు ఈత కొట్టుడు నేర్పిచ్చిను. ఆముదపు లొట్టలు కట్టి దింపేవారు. తరువాత కొన్ని రోజులకు ఈత కొట్టుడు నేర్చుకున్నరు రవి, శివలు.

ఊళ్ళో పెద్ద చెరువు ఉంది. వానాకాలం వచ్చిందంటే చాలు వానలు బాగా పడి ఊళ్ళో పెద్ద దర్వాజ దగ్గరికి వచ్చేవి. అలుగులు దుంకేవి. బడికి పోవాలంటే చుట్టు తిరిగి పోవాలి.

చుట్టూ ఎందుకు తిరిపోవాలి. ఇట్ల పోతే బడి దగ్గర అని నీళ్లలో నుండి పోదాం అనుకున్నరు

నీళ్లలో పోతే కొట్టుకుపోవడం ఖాయం. శివకు,హరికి మాత్రమే ఈత వచ్చు. ధైర్యంగా పుస్తకాల బ్యాగ్ భుజాన వేసుకుని వెళుతున్నారు. వీళ్ళతో సీను అనే దోస్త్ కూడా ఉన్నడు.

ఒరే సీను నీవు రావద్దురా నీళ్లలో అన్నడు రవి.

ఏమి కాదు నడుచుకుంటూ పోవచ్చు అన్నడు సీను.

వద్దురా నీకు ఈత కూడా రాదురా అన్నడు శివ.

చెపితే వినకుండా ఏమి కాదులే. మోకాలులోతు వరకే నీళ్లు వచ్చినవి అన్నాడు సీను.

వద్దంటే వినకుండా రవి, శివునితో పాటు బ్యాగ్ లు వేసుకుని వెళ్ళినరు.

కొద్దిదూరం పోగానే కాళ్ళు తెలిపోయి నీళ్లలో మునుగుతున్నడు సీను. నీళ్లు మింగుతున్నడు.

ఒరే రవి! సీను గాడు నీళ్లు మింగుతున్నడురా అన్నాడు శివ.

చిన్న పిల్లలు ఇద్దరు. పెద్దలకు తెలియకుండ నీళ్లలో పోతున్నరు. చిన్నపిల్లల చేష్టలు.

ఏం చేద్దాంరా. ఏమన్నా అయితే కష్టం అంటూ రవి సాహసానికి ఒడికట్టి ధైర్యం చెప్పాడు.

మనిద్దరం కలిసి వీణ్ణి పట్టుకుని పోదాం అన్న రవి మాటలు విని ఇద్దరు సీనును ఎత్తుకుని కాళ్ళు ఒకరు,టెస్కా ఒకరు పట్టుకుని పైకెత్తి మెల్ల మెల్లగా ఈదుకుంటూ ఒడ్డు చేరుకున్నరు. ఏదో కథలో విన్నమాటబట్టి సీనును బోర్లాపడుకోబెట్టి బాగా ఒత్తితే మింగిన నీళ్లు నోటినుండి బయటకు వచ్చినవి. అమ్మ అమ్మ అన్నడు సీను. బతికిందురా అంటూ ఊపిరి పీల్చుకున్నరు.

నీళ్లలో మునిగిన సంగతి ఊళ్ళో తెలిసింది. సీను అమ్మ నెత్తి నోరు కొట్టుకుంటూ వచ్చింది. చెపితే వినడు .ప్రాణం మీదికి తెచ్చుకున్నడు అన్నది అమ్మ.

ఏమి కాలేదు అత్త .మేము కాపాడినం అన్నరు ముక్తకంఠంతో రవి, శివలు.

మీకు ఈత వచ్చినందుకు ఈరోజు నా కొడుకు బతికిండు. ఆ దేవుడు మిమ్మల్ని చల్లగ చూడాలి నాయనా అంటూ కొడుకు బతికివచ్చినందుకు ధన్యవాదాలు తెలిపింది సీను వాళ్ళ అమ్మ.

ఊళ్ళో అందరూ ఇంత చిన్నపిల్లలైనా ఎంత ధైర్యం చేసి ఈ రోజు సీనును కాపాడింరు అంటూ అందరూ దీవనలిస్తూ ఎవరి దారిని వారు వెళ్లారు.

తర్వాత ఎండాకాలం సెలవుల్లో సీను కూడా ఈత కొట్టడం నేర్చుకున్నడు..



**–డా. చీదెళ్ళ సీతాలక్ష్మి**
9490367383

---




జులై 7న కళా సుబ్బారావు కళావేదికలో 'వ్యాస మంజూష' గ్రంథావిష్కరణలో రచయిత జన్నాభట్ల నరసింహప్రసాద్‌ను సత్కరిస్తున్న గుదిబండి వెంకటరెడ్డి, పొత్తూరి సుబ్బారావు, బైస దేవదాసు, ఆచార్య కొలకలూరి ఇనాక్.




జులై 7న కళా సుబ్బారావు కళావేదికలో జరిగిన పుస్తకావిష్కరణలో 'వ్యాస మంజూష' గ్రంథాన్ని డా॥ హిప్నో పద్మా కమలాకర్‌కు అంకితం ఇస్తున్న రచయిత జన్నాభట్ల నరసింహప్రసాద్. వేదికపై శ్రీమతి జన్నాభట్ల లక్ష్మీ కామేశ్వరి, గుదిబండివెంకటరెడ్డి, పొత్తూరి సుబ్బారావు, బైస దేవదాసు, ఆచార్య కొలకలూరి ఇనాక్, డా॥ మట్టా హారిక.

## అలుక-బుజ్జగింపు!

**ఆ.వె**
పుస్తకాలు లేవు పొమ్మనిరి బడికి
ఎటుల బోదు నేడు నేమి జేతు
మొదటి రోజె నాకు మొట్టి కాయలు గదా
యనుచు నలిగె నేమొ యనుగు బిడ్డ!.

**ఆ.వె**
బడిల మొదటి రోజు పాఠాలు జెప్పరే
కొత్త పుస్తకాలు గురువులివ్వ
యెరుగుదువుగ తల్లి యెందు కల్గెదవుర
ఏక రూప దుస్తులిత్తు రచట!.

**కందము**
మధ్యాహ్న భోజనాలును
విద్యార్థుల కుచితముగను ప్రియముగ నుండున్
ఉద్యమముంగను జెప్పి రు
పాధ్యాయులు బడికి బిల్వ బాలల నిటులన్.

**ఆ.వె.**
వేసవిసెలవులందు వేడ్కగ నాడిన
నాట లన్ని చూపు నాడి పాడి
తాత జెప్పు కథల తప్పక జెప్పగ
మెచ్చుకొనగ నిన్ను మృదుల వినవె!



**–యెనిశెట్టి గంగా ప్రసాద్.**
సెల్ 9866447234.

## నాన్న నానీలు

నాన్నంటే
నడిచే ఏటిఎం కాదు
ప్రేమానురాగాల
రిజర్వు బ్యాంకు

నాన్నంటే
భూతం కాదురా కన్నా
భవిష్యత్తును చూపించే
భూతద్దం.

–వెన్నెలసత్యం, సెల్:9440032210





# నడుస్తున్న గ్రంథాలయం కత్తి పద్మారావు



– బి.ఎస్.రాములు
8331966987



-డా॥అడె బుచ్చి (అంత్యజ), సెల్: 9441722414

**కత్తి పద్మారావుగారి రచనలు, ప్రసంగాలు, కలివిడితనం తనకు తెలియకుండానే వారి కుటుంబ సభ్యురాలై పోయింది. దత్తపుత్రికలా మారిపోయింది. ఎప్పుడైతే తన కర్తవ్యం బోధపడిందో అప్పటినుండి కత్తి పద్మారావుగారి ప్రసంగాలను అక్షరీకరించడం మొదలుపెట్టింది. గొప్పపని చేయకపోయినా గొప్పపని చేసేవారికి సహకరించడం కూడా గొప్పపనే.**

**అలా డా॥ అడె బుజ్జి "డా॥ కత్తిపద్మారావు ప్రసంగాలు 2012-2020" గ్రంథాన్ని వెలువరించారు. ఈ గ్రంథానికి తెలంగాణ పూర్వ బి.సి. కమీషన్ చైర్మన్ బి.యస్.రాములు రాసిన ముందు మాటను డా॥ కత్తి పద్మారావు (జులై 27) 70వ జన్మదిన సందర్భంగా నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకం.**

-సంపాదకులు: బైసదేవదాసు

> "పుస్తకాలు, నోట్సు చూడకుండానే వందలాది శ్లోకాలు, కొటేషన్లు వారి ఉపన్యాసాలలో జాలువారుతుంటాయి. కత్తి పద్మారావు గొప్ప ఆలోచనాపరుడు. చాలామంది మేధస్సుతో ఆలోచిస్తారు. కత్తి పద్మారావు హృదయంతో ఆలోచిస్తారు.

అడె బుజ్జి ఉన్నత విద్యావంతురాలు. గుంటూరు జిల్లా బాపట్ల నివాసి. డాక్టర్ కత్తి పద్మారావుగారిది పొన్నూరు. బాపట్లకూ పొన్నూరు పెద్ద దూరం లేదు. అయినా కత్తి పద్మారావుగారిని ఆలస్యంగా తెలుసుకుంది. దూరం నుంచి వింటూ స్ఫూర్తి పొందుతున్నా కలుసుకోవడానికి జంకు. పెద్దవారిని కలవడం పట్ల జంకు. ఆలోచించి ఆలోచించి ధైర్యం చేసింది. కత్తి పద్మారావుగారి ప్రసంగాలు విన్నారు. కలిసి మాట్లాడారు. ఆ కలుపుగోలుతనంలో ఆత్మీయతకు అచ్చెరువొందింది. తన ఆలోచనలు విప్పింది. అన్నింటికి సమాధానాలు దొరికాయి. జీవితం ఎలా గడపాలో, డబ్బును, కాలాన్ని, జ్ఞానాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలిసింది. కత్తి పద్మారావుగారి రచనలు, ప్రసంగాలు, కలివిడితనం తనకు తెలియకుండానే వారి కుటుంబ సభ్యురాలై పోయింది. దత్తపుత్రికలా మారిపోయింది. ఎప్పుడైతే తన కర్తవ్యం బోధపడిందో అప్పటినుండి కత్తి పద్మారావుగారి ప్రసంగాలను అక్షరీకరించడం మొదలుపెట్టింది. గొప్పపని చేయకపోయినా గొప్పపని చేసేవారికి సహకరించడం కూడా గొప్పపనే. అడె బుజ్జి అదే పని చేసింది. సభలకు, సమావేశాలకు వెళ్లింది. తానే సభలు, సమావేశాలు ఏర్పాటుచేసింది. విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. అంబేద్కర్ రచనలు, అంబేద్కర్ గురించిన కత్తి పద్మారావు రచనలు కొన్ని బహుమతులిచ్చారు. చాలాచోట్ల వేలాది రూపాయల పుస్తకాలు కొని ఉచితంగా పంచారు. దళిత మహాసభ ఉద్యమం తెలంగాణా, సమైక్యాంధ్ర ఉద్యమాల్లో ఆగిపోయిందనుకున్నారు. ఆగిపోలేదు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమం న్యాయ సమ్మతమని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఎన్నో ప్రసంగాలు చేశారు. వ్యాసాలు రాశారు. హైదరాబాద్‌లోనే కాదు, టీవీల్లో గర్జించారు. రాష్ట్రాల ఏర్పాటుకు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన రెండవ, మూడవ ఆర్టికల్స్‌ను పొందే పద్ధతులు గుర్తుచేశారు. దళిత సాహిత్యం నిరంతరం రాస్తూనే టీవీ చర్చలు, వివిధ సంఘాల నాయకుల మధ్య సమన్వయం కోసం, సైద్ధాంతిక అవగాహనకోసం సమావేశాలు, నిర్వహించారు. ఎప్పటికప్పుడు వర్తమాన విషయాలపై దినపత్రికలో కన్నా వేగంగా స్పందించారు. ఆయా విషయాలపై స్పష్టతనిచ్చారు. ఇవన్నీ చేస్తూ ఎన్నో ప్రసంగాలు చేయడం, పలు పుస్తకాలు వేయడం మాటలు కాదు. కుటుంబమే ఒక కార్పోరేట్ కార్యాలయంగా అంకిత భావంతో పనిచేయడం వల్లనే ఇవన్నీ సాధ్యమయ్యింది. స్వర్ణకుమారి ఒక అన్నపూర్ణ. తన చేత ఎన్ని వేల మందిని తల్లిగా ఆదరించిందో..!

కత్తి పద్మారావు, మేము ఎన్నో ఏండ్లుగా కలిసి నడిచాము. పొద్దుకు మూడుసార్లు ఫోన్లో మాట్లాడుకున్నాము. కత్తి పద్మారావుగారు అన్నట్టు 1993 నుండి మేం మాట్లాడుతున్నవన్నీ బుజ్జిగారు రికార్డు చేసినట్టు చేసి ఉంటే అది తెలుగు రాజకీయ, సామాజిక, ఉద్యమాలు, సాగిన కృషికి గొప్ప రిసోర్స్ అయివుంటుంది. అది ఈ గ్రంథంలా వందలాది అంశాలకు వెలుగులు అందించి వుండేది. బహిరంగ సభలలో ఈ ప్రసంగాలు జ్ఞాన ప్రబోధాత్మకం. ఇద్దరు మేధావుల మధ్య సాగే సంభాషణ ఈ సమాజాన్ని, దేశాన్ని, ప్రపంచాన్ని ఎలా ముందుకు నడవాలి, ఏ వివక్షలు, అసమానతలు లేని నూతన మానవ సమాజం నిర్మాణం ఎలా సాగాలో, అందుకు ఏ సైద్ధాంతిక భూమిక అవసరమో మొదలైనవి చాలా చర్చించాము. అవి గాలిలోనే పోయాయా అని ఇద్దరం బాధపడుతున్న సమయంలో అడె బుజ్జి ఈ పుస్తకం పంపింది. నా ఆనందానికి అంతులేదు.

మేం చర్చించుకున్న విషయాలెన్నో ఈ ప్రసంగాలలో నిక్షిప్తమయ్యాయి. జ్ఞానం ఊరికే పోదు. ఎక్కడో ఒకచోట ప్రదర్శితమవుతూనే ఉంటుంది. డా॥ కత్తి పద్మారావుగారు ఆవేశపూరితంగా, స్ఫూర్తిదాయకంగా చేసే ప్రసంగాలలో, చిక్కుల్లో ఎంత చరిత్ర, ఎంత జీవితం, ఎన్ని జ్ఞాపకాలు, ఎంత తాత్వికత, ఎంత విశ్లేషణ , ఎన్ని ఉదాహరణలు కలిసి ఉంటాయో ఈ ఉపన్యాసాలు చదివితే తెలుస్తుంది.

డా॥ కత్తి పద్మారావుగారి మహోన్నత ప్రసంగావేశాలను కొత్తగా పరిచయం చేయనక్కర్లేదు. వారి ప్రసంగాలు క్యాసెట్లుగా, సీడీలుగా లక్షలాది మందిని చేరాయి. కార్యక్రమాలకు, కర్తవ్యాలకు ఉత్తేజితుల్ని చేశాయి. ఒకనాడు పెద్దాయన దళిత మహాసభ అధ్యక్షులు దేవరపల్లి మస్తాన్‌రావుగారు కత్తి పద్మారావుగారి ప్రసంగాలు రికార్డు చేశారు. మరికొన్ని క్యాసెట్లలో రికార్డయ్యాయి, కాని విలువైన సమాచారాన్ని, సామాజిక చరిత్రను, నమకాలీన విశ్లేషణను దట్టించిన ఉపన్యాసాలు అక్షరీకరించబడి పుస్తకం గా రాలేక పోయాయి. అది కష్టమైన పని. ప్రసంగం వినాలి. రాయాలి. సరిచూసుకోవాలి. ఫేర్ చేయాలి. రాసే క్రమంలో మిస్సయిన ముఖ్యాంశాలను గుర్తు చేసుకోవాలి. వాటిని వాటి స్థానంలో తిరిగి చేర్చాలి. ఇంత పని చేయడం అందరితో కాని పని. అలాంటి కష్టమైన పనిని ఎంతో ఇష్టంగా, ఒక కర్తవ్యంగా నిర్వర్తించారు అడె బుజ్జి గారు. అడె బుజ్జి ఏకసంథాగ్రాహి కాకుండా ఇంత గొప్పగా రాయడం ఎలా సాధ్యం? బుజ్జి ఈ ప్రసంగాలతో పాటు చరిత్రలో ఫూలే, అంబేద్కర్ జీవిత చరిత్రలు రాసిన ధనుంజయ్ కీర్‌లా కలకాలం నిలిచిపోతారు.

డాక్టర్ కత్తి పద్మారావుగారు వేల గ్రంథాలను పుక్కిటపట్టిన మహా మేధావి. ఏక సంథాగ్రాహి. పుస్తకాలు, నోట్సు చూడకుండానే వందలాది శ్లోకాలు, కొటేషన్లు వారి ఉపన్యాసాలలో జాలువారుతుంటాయి. కత్తి పద్మారావు గొప్ప ఆలోచనాపరుడు. చాలామంది మేధస్సుతో ఆలోచిస్తారు. కత్తి పద్మారావు హృదయంతో ఆలోచిస్తారు. అందువల్లే గొప్ప ఉపన్యాసాలతో పాటు గొప్ప కవిత్వం రాశారు. అందువల్లే వారి ప్రసంగాల్లో జీవితం ఉంటుంది. జీవితమే సిద్ధాంతంగా, ప్రభోదంగా మలిచే తీసుకుంటుంది. కత్తి పద్మారావుగారి ప్రసంగాలు వారి హృదయాన్ని వెల్లడించడంతోపాటు వారి భాషను, భావోద్వేగాన్ని తెలుపుతాయి. వారి భాషలో ఆవేశం ఉంటుంది. ఆలోచన వుంటుంది. సిద్ధాంతం ఉంటుంది. సౌందర్యం ఉంటుంది. అలంకారం ఉంటుంది. మహా వృక్షాల ఒరిపిడిలో పుట్టే దావాగ్ని ఉంటుంది.

> "కత్తి పద్మారావు ప్రసంగాల్లో మాటల్లో వారి వ్యక్తిత్వం ఉంటుంది. సంస్కారం ఉంటుంది. సంఘ సంస్కరణ ఉంటుంది".

కత్తి పద్మారావుగారి ప్రసంగం ఒక కళ. ఒక శాస్త్రం. వారి ప్రసంగంలో ఒక మహా వక్త, ఒక తత్వవేత్త, ఒక ఆర్గనైజర్, ఒక నాయకుడు, ఒక గురువు, ఒక మహోన్నత మానవతావాది ఏక కాలంలో సాక్షాత్కరిస్తాడు. కత్తి పద్మారావు ప్రసంగం ప్రారంభించాడంటే ఒక బెబ్బులి... ఒక సింహ గర్జన... ఉరుములు మెరుపులతో పిడుగులు కురుస్తాయి. శత్రువు గుండెలదరుతాయి. అభిమానుల గుండెల నిండా ఉత్సాహం, ఉద్వేగం, ఆనందం, ఆత్మవిశ్వాసంతో చప్పట్లతో మారుమోగుతాయి. పదినిమిషాలలో ముగించాలంటే సరే అంటారు. కాని మనకు గంటా గంటన్నర మాట్లాడినా టైమెంత గడిచిందో తెలియకుండా లీనమై, తన్మయులై చప్పట్లు కొడుతాం. ఆ ప్రవాహంలో మునిగి తేలుతాం.. వారితో మాట్లాడటమే ఒక ఎడ్యుకేషన్. వారి ప్రసంగం వినడం జీవితంలో మరిచిపోలేని మధురమైన జ్ఞాపకాలు. వారి ప్రసంగాలు నిత్యనూతనం.

కత్తి పద్మారావు ప్రసంగాల్లో మాటల్లో వారి వ్యక్తిత్వం ఉంటుంది. సంస్కారం ఉంటుంది. సంఘ సంస్కరణ ఉంటుంది. కత్తి పద్మారావులో ఒక బోధకుడున్నాడు. వక్త రూపంలో ఒక ప్రవక్త ఉన్నాడు. కత్తి పద్మారావు పీడిత ప్రజల ఆశా జ్యోతి.

ఇవి కేవలం ప్రసంగాలే అనుకుంటే పొరపాటు. ఇందులో కత్తి పద్మారావు జీవితం ఉంది. జీవిత పరిణామం ఉంది. దళిత మహాసభ చరిత్ర ఉంది. సాధించిన విజయాలున్నాయి. ఉద్యమంలో మలుపులున్నాయి. ఉద్యమంలో పాల్గొన్న ప్రజలున్నారు. కార్యకర్తలున్నారు. త్యాగశీలుర జ్ఞాపకాలున్నాయి. కుటుంబం అంటే ఎలా ఉండాలో స్వయంగా ఆచరించిన తీరుంది. కుల నిర్మూలన ఎలా జరగాలో తన కుటుంబాన్ని అలా మలిచిన తీరుంది. హేతువాద, శాస్త్రీయ పరిశీలన ఉంది. డా॥ బి.ఆర్.అంబేద్కర్ మార్గదర్శనం ఉంది. మన పూర్వీకులు చార్వాకులైన వారసత్వ చరిత్ర ఉంది. మహాత్మా జ్యోతిరావుఫూలే, పెరియార్ రామస్వామి, త్రిపురనేని రామస్వామిగార్ల వారసత్వ స్వీకరణ ఉంది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమం కాలంలో కూడా దళిత ఉద్యమం ఎన్ని రూపాలలో కొనసాగించారో ఈ ప్రసంగాలు ద్వారా తెలుస్తుంది.

ఉత్తరాంధ్ర లక్షింపేట పోరాటం, బేతాళ సునీల హత్య, అంబేద్కర్ విగ్రహావిష్కరణలు, జయంతి సభలు, కత్తి పద్మారావుగారి 60వ జన్మదిన సభలు, లోకాయత్ శుభల కులాంతర వివాహం, నవ్యాంధ్ర పార్టీ నిర్మాణం, దళితులకు రాజ్యాధికారం, కులం పునాదులు, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ స్థాపన ఉద్యమం, మద్యపాన నిషేదం ఆవశ్యకత, దళిత మహిళలకు రెండెకరాల భూమి, తల్లి మనసు, జీవితానికి ప్రణాళిక, వృద్ధులు, పెన్షన్, విద్యార్థినుల కష్టాలు, యూనివర్సిటీ అధ్యాపకులు, కులం, మతం దేవుడు, బ్రాహ్మణ భావజాలం, కుటుంబ ఆత్మీయ సంస్కృతి, ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషు మీడియం, జైలులో సౌకర్యాలు, కరోనా వైరస్ శాస్త్రీయ విజ్ఞానం మొదలైన అంశాలు, సందర్భాలు ఆధారంగా ఎన్నో విషయాలు మనకందించారు. పదేళ్ల ప్రసంగాల ఈ సంకలనం వందలాది అంశాలకు వెలుగులు విరజిమ్ము తాయి..

డాక్టర్ కత్తి పద్మారావు ప్రసంగాల్లో. వెతికితే ఎన్ని ముత్యాలో! జీవితానికి ఎన్ని పాఠాలో! ఎన్ని జీవితాలను వడబోసి, సొంత జీవిత కథను కూడా జోడించి ఎంత సులభంగా. అలవోకగా అందిస్తారో..! పండితులతో, విద్యావేత్తలతో, మేధావులతో, లండన్ పార్లమెంటులో మాట్లాడిన మహా పండితుడేనా ఇంత సరళంగా మాట్లాడింది అని ఆశ్చర్యం కలుగుతుంది. తనవాళ్లు, గ్రామీణ దళితులను సంబోధించినపుడు కత్తి పద్మారావు భాష, సంస్కృతి, ఆ ఆత్మీయత, ఎంత ఆర్ద్రంగా, హృదయాల్ని కదిలిస్తుందో! అనేక కథలతో, సామెతలతో, పలుకుబడులతో చేసే ఆ ప్రసంగం విని తీరాల్సిందే.

వ్యాసం కన్నా సంభాషణ లో, ముచ్చట్లలో, గోష్ఠిలో ఒక ప్రత్యేక సౌకర్యం ఉంటుంది. ఏదో ఒక దాంతో, ఎక్కడి నుంచి మొదలు పెట్టినా గిర గిరా లోకమంతా చుట్టి మళ్లీ అసలు విషయానికి అన్వయిస్తూ కొనసాగించవచ్చు. అట్లా కత్తి పద్మారావు చేసిన ఎత్తుగడలు ఎన్నో ఈ ఉపన్యాసాలలో చూడవచ్చు. కత్తి పద్మారావు ప్రసంగాలలో దళిత ఉద్యమ చరిత్ర, మలుపులు, వీరోచిత ఉద్యమాలతో. సాధించిన విజయాలు, స్వీయ చరిత్రలోని అనేక ఘటనలు ఒక అస్పృశ్యుని యుద్ధగాధలో రికార్డు కానివెన్నో ఈ పుస్తకంలో చూడవచ్చు. ప్రసంగం వేశాను ఏదో గుర్తుకు రాగానే దానికి సంబంధించిన అనేక అంశాలు జోడించి చెప్పడం వల్ల మనస్సులో హత్తుకు పోతుంది. సాధారణంగా ఉపన్యాసాలలో చెప్పిందాన్ని బలపరుస్తూ మరికొంత నొక్కి చెప్తారు. అలాంటి వాటిని రాతలో తగ్గించి ఒక్కొక్క ప్రసంగం. ఒక్కొక్క సెమినార్ పత్రంలా సంకలకర్త తీర్చిదిద్దిన తీరు ప్రశంసనీయం.

కత్తి పద్మారావు కుటుంబంలో ఎందరో పొన్నూరులో ఉన్నా, హైదరాబాద్‌లో ఉన్నా వారి ఇల్లే ఒక ఉద్యమ కేంద్రం. మంచినీళ్లు ఇచ్చి పంపడం కాకుండా మంచి భోజనంతో ఆతిథ్యం ఇవ్వడంలో కత్తి స్వర్ణకుమారిగారు వారికి వారే సాటి. వేలాదిమంది దళిత కార్యకర్తలు, రచయితలు మేధావులే గాకుండా ఎందరో జాతీయ, రాజకీయ నాయకులు ఆతిథ్యం అందుకున్న వారిలో ఉన్నారు. రాం విలాస్ పాశ్వాన్, ప్రకాశ్ అంబేద్కర్, అరుణ్ కాంబ్లే, వంగపండు, మాష్టార్జీ, బి.ఎస్ రాములు, దేవరపల్లి మస్తాన్ రావు, కొలకలూరి ఇనాక్, దళిత ఏలుమలై, మల్లు రవి, అంగలకుర్తి విద్యాసాగర్, కెసిఆర్, దుర్గం రవీందర్, గూడ అంజయ్య, కొత్తపల్లి రవిబాబు, ముత్యాల ప్రసాద్ , కవి కె శివారెడ్డి, ప్రొఫెసర్ విమల, గోగు శ్యామల, జూపాక సుభద్ర , కృపాకర్, కె ఎన్ రామదాస్, సోగరా బేగం, స్నేహారెడ్డి, గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, వి జి ఆర్ నారగోని, బి.వినోద్ (మాజీ ఎం.పి) ఈటల రాజేందర్, పి. శ్రీనివాస్ గౌడ్, జుగాష్ విలి, ఎం. చంద్రశేఖర్ (జర్నలిస్టు), మెగాస్టార్ చిరంజీవి, గద్దర్, నాస్తిక గోరా గారి విజయం, విదేశీ ప్రముఖులు సైమన్........., చార్లీ పేర్లు సరిచూడాలి) మొదలైన వారెందరో స్వర్ణకుమారిగారి ఆతిథ్యం అందుకున్న వారిలో ఉన్నారు. స్వర్ణకుమారిగారికి తన తోడి కోడండ్లు, ఉమ, రాధ, ఆ తరువాత తన కోడండ్లు నళిని, .శుభ కూడా చేతికి అందివచ్చి ఎంతగానో సహకరించారు. స్వర్ణకుమారిగారి ఆత్మీయత వల్ల లుంబినీవనం వచ్చిన కార్యకర్తలకు తమ సొంత ఇంటికి వచ్చినంత ఆనందం, అరమరికలు లేని కలుపుగోలుతనం. ..! ఒక ఆదర్శ సంస్కృతి నిర్మాణానికి నిదర్శనంగా నిలిచారు. ఇంటిలోనే కాదు సదస్సులు, సభలు సమావేశాల్లో కూడా స్వర్ణకుమారి, కత్తి పద్మారావు గారిది ప్రత్యేక, విశిష్ట శైలి. చాలామంది అలాంటి సందర్భాల్లో పులిహోర పొట్లాలు, లేదా సాంబార్ అన్నం పెడు తుండటం గమనించవచ్చు. భోజనం విషయంలో కత్తి పద్మారావు దృష్టి మర్యాద ప్రత్యేకమైనది. కత్తి పద్మారావుగారు భోజనం పెట్టడం కూడా ఒక ఆదర్శ సంస్కృతి నిర్మాణంగా భావిస్తారు. సన్న బియ్యం అన్నం, ఒక పప్పు, ఒక కూరగాయ , సాంబార్, రసం, పెరుగు, వీలైతే పాపడాతో సహా. ఉడిపి హొటల్ రుచికరమైన భోజనాన్ని తలపించే విధంగా భోజనాలు ఏర్పాటు చేసేవారు.

కత్తి పద్మారావు ప్రసంగాలలో భాష , సంస్కృతి ప్రత్యేకంగా ఉంటుంది. ప్రజల జీవితానికి దగ్గరగా వుంటుంది. వారి ప్రసంగం కార్యోన్ముఖు లను చేస్తుంది. ప్రసంగంలో ఆనాటి కార్యక్ర మంతో పాటు. ఆ తరువాతి కార్యక్రమానికి రూపకల్పన ఉంటుంది. ఒక ప్రసంగం నుండి. మరో కార్యక్రమానికి, ఆ కార్యక్రమం మరో ప్రసంగానికి, కార్యక్రమానికి ఒక గొలుసుకట్టు నిర్మాణం ఉంటుంది. ఇట్లా కార్యక్రమాలు తెగని గొలుసులా రూపొందించడం కత్తి పద్మారావు విజయం రహస్యాల్లో ఒకటి.

> "కొందరు ఆదర్శాలు చెప్తారు. కొందరు ఆదర్శంగా జీవిస్తారు. కొందరు ఆదర్శ సమాజం నిర్మాణం కోసం కృషి చేస్తారు. ఆదర్శాలు చెప్తూ, ఆదర్శంగా జీవిస్తూ తన చుట్టూ ఆదర్శ సమాజం నిర్మాణంతోపాటు , తన కుటుంబం మొత్తాన్ని ఆదర్శాలు కనుగుణంగా మలచడం, కొందరికే సాధ్యం. ఆ కొందరిలో. సమకాలీన సమాజంలో కత్తి పద్మారావు కుటుంబం ఒక గొప్ప నిదర్శనం"

కొందరు ఆదర్శాలు చెప్తారు. కొందరు ఆదర్శంగా జీవిస్తారు. కొందరు ఆదర్శ సమాజం నిర్మాణం కోసం కృషి చేస్తారు. ఆదర్శాలు చెప్తూ, ఆదర్శంగా జీవిస్తూ తన చుట్టూ ఆదర్శ సమాజం నిర్మాణంతోపాటు , తన కుటుంబం మొత్తాన్ని ఆదర్శాలు కనుగుణంగా మలచడం, కొందరికే సాధ్యం. ఆ కొందరిలో. సమకాలీన సమాజంలో కత్తి పద్మారావు కుటుంబం ఒక గొప్ప నిదర్శనం.

కత్తి పద్మారావు గృహానికి లుంబినీవనం అని పేరుపెట్టారు. అది బుద్ధుడు కాలాన్ని గుర్తు చేస్తుంది. చార్వాక, లోకాయుకత, చేతన్, దర్శన్, జాబాలి, అవేద్, నాస్తిక్, అనివార్య, సృజన, అవర్ణ, మొదలైన పేర్లు వైదిక కాలంనాటి సమాజానికి భిన్నంగా సమాంతర తాత్విక పీఠాలను, చార్వాకుల ఆశ్రమాలను. గుర్తు చేస్తాయి. కుటుంబంలో కులాంతర వివాహాలు సామాజిక వివాహ విధానం, ఇవన్నీబ్రాహ్మణీయ సంస్కృతికి. భిన్నంగా సమాంతర. సంస్కృతి నిర్మాణంలో భాగం. ఒక నూతన ఆదర్శ కుటుంబం నమూనాకు చిహ్నంగా నిలుస్తుంది లుంబినీవనం. ఆ లుంబినీవనంలో. ఫూలే, సావిత్రిబాయి ఫూలే, అంబేద్కర్, పెరియార్, జాషువా విగ్రహాలతో. ఇల్లే చరిత్రను తలపించేదిగా ఉంటుంది. అందుకే కత్తి పద్మారావు ఒక ప్రసంగంలో ఇలా అంటారు. "ఒకటి నాకు బాగా అర్థమైంది. లీడర్ మరియు మేధావి ముందు ఇంటిని జయించాలి. చాలా మంది లీడర్లు ఇంటిని జయించలేరు."

కత్తి పద్మారావు ప్రతి ఇంట గ్రంథాలయం ఉండాలని అంటారు. తన గ్రంధాలయం గురించి, ప్రపంచంలో పేరెన్నికగన్న అంబేద్కర్ గ్రంథాలయం గురించి జ్ఞానం ప్రాధాన్యత గురించి వివరిస్తారు. మీటింగ్ నుండి వెళ్ళేటపుడు ప్రతిఒకరి చేతితో పుస్తకం కొనబడాలని పుస్తకాలు కొనేట్టు చేస్తారు. ఇలా ఒక సభ ద్వారా, ఒక ప్రసంగం ద్వారా సామాజిక చైతన్యం, సాంస్కృతిక చైతన్యం, తదుపరి కార్యక్రమం, కులాంతర వివాహాలు, వ్యక్తిత్వ వికాసం, జీవితం గురించిన అవగాహన, పాఠాలు, సంఘటిత శక్తి. ధైర్యం, మొదలైనవెన్నో సాధిస్తారు. అవి ఎలా సాధిస్తారో ఈ పుస్తకంలోని ప్రసంగాలు అద్దంలో కొండలా చూపుతాయి. ●



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న కత్తి స్వర్ణ కుమారి. వేదికపై డా॥ కత్తి పద్మారావు, వేము, మాధవ్, గద్దం, విజయరావు, డా॥ అడె బుజ్జి



గుంటూరులో గ్రంథావిష్కరణలో బొస్కో లొయల, డా॥ కె.హెచ్. బెంజమిన్, సి.హెచ్. మనోరంజని, డా॥ అడె బుజ్జి



విజయవాడలో గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న విజయ చంద్రన్, ఎడిటర్, ప్రకాశ్, డా॥అడె బుజ్జి, డిఆర్‌డిఏ, ఎం.ఏ. రాజారత్నం, బి.బాలరాజు, సి.హెచ్ గోపాల్ నత్తల రవికుమార్,

# తాత్వికత కవిత్వానికి భూమిక.

## –అమరావతి సాహితీ మిత్రులు సభలో అబ్దుల్ రజా హుస్సేన్.



తాత్వికత కవిత్వానికి భూమిక అని ప్రముఖ సాహితీ వేత్త అబ్దుల్ రజా హుస్సేన్ తెలిపారు ఆదివారం ఉదయం గుంటూరు బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో అమరావతి సాహితీ మిత్రులు నిర్వహించిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పైగంబర కవిత్వ ఉద్యమ నిర్మాతగా పేరుగాంచిన ఎం. కె. సుగం బాబు లఘు కవితా కావ్యం "కాంతి ధార" ఆయన ఆవిష్కరించి ప్రసంగించారు. 'రెక్కలు'' లఘు కవితా ప్రక్రియ సృష్టికర్తగా మన్ననలు పొందిన సుగం బాబు రాసిన "కాంతి ధార" కావ్యంలో తాత్త్వికత పరిమళిస్తుం దని తెలియజేశారు.

తాత్వికత సామాజిక తాత్వికతగా మారే చక్కని కవిత్వం రాసినందుకు కవిని ప్రశంసించారు. అమరావతి సాహితీ మిత్రులు సంస్థ అధ్యక్షులు డాక్టర్ రావి రంగారావు డా. చింతలపాటి మోహన మురళీ కృష్ణ రాసిన "సిరి దివ్వెలు" కావ్యంలోని వర్ణనల గురించి మాట్లాడారు. ఇంకా ఈ సభలో సాంధ్య శ్రీ రచించిన "ది సాంగ్ ఆఫ్ మై లైఫ్' పుస్తకాన్ని ప్రముఖ సాహితీవేత్త డా. భూసురపల్లి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు.

సుగంబాబు రచన "కాంతి ధార"ను ప్రముఖ కవయిత్రి తుమ్మల స్నిగ్ధ మాధవి సమీక్షించారు. కవితా ధార నిజంగా వెలుగు ధారగా ప్రవహించిందని ఆమె విపులీకరించారు. సంజీవదేవ్ సాహిత్యం గురించి ఎన్నార్ తపస్వి సోదాహరణంగా ప్రసంగించారు. మార్మికత సంజీవదేవ్ కవిత్వంలో అంతర్లయగా ప్రవహిస్తుందని ఆయన చెప్పారు. "ఈమాసం కవి"గా ప్రముఖ గాయకులు ఆల్లక తాతారావు (మంగళగిరి) పాల్గొని వివిధ అంశాల మీద వినిపించిన గేయాలు సభను బాగా ఆకట్టుకున్నాయి. "ఈమాసం కవి"గా పాల్గొన్న తాతారావును ప్రముఖ వైద్యులు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ టి. సేవా కుమార్, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ల ప్రతినిధి నూతలపాటి తిరుపతయ్య, ఇంకా సంస్థ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. అనంతరం పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన కవి సమ్మేళన కార్యక్రమంలో కౌతరపు రామచంద్రరావు, కె. కవిత, గోలి మధు, షేక్ కాసింబి, పుష్ప, యక్కంటి పద్మావతి, జంగా నరేంద్ర, ఎం. సుబ్బారావు, మేళ్లచెరువు మాధవి, రాయసం గిరిజా రాణి, చందు నాగేశ్వరరావు, ఈవూరి వెంకటరెడ్డి, మురుగుడు శ్రీహరి మొదలైన కవులు పాల్గొన్నారు.

# ప్యారా హైదరాబాద్



హైదరాబాద్ అంటే ఒక అందమైన నగరం!!
హైదరాబాద్ అంటే మనకు ఆత్మగౌరవం!!
బతుకు నిచ్చే మా భాగ్యనగరం!!
భాగ్యనగరంలో బహుభాషలు మాట్లాడే వారెందరో!!

భాగ్యనగరం అంటే బతుకుని మార్చే భాగ్యనగరం!!
బతుకు బాట చూపే భాగ్యనగరం!!
సర్వ మతాల సమ్మేళనం హైదరాబాద్!!
సర్వ మతాల నిలయం హైదరాబాద్!!

భాగ్యనగరంలో బతుకు చిత్రాలు ఎన్నో!!
తెలంగాణకు ఆయువు హైదరాబాద్!!
హైదరాబాద్ అంటే ఉద్యమాల గడ్డ!!
హైదరాబాద్ ఆకలి మంటలెన్నో!!

కాంతులతో వెలిగే హైదరాబాద్!!
హైదరాబాద్ అంటే ఒక వెలుగు!!
తెలంగాణ ఖ్యాతి మన హైదరాబాద్!!
తెలంగాణ గుండె మన హైదరాబాద్!!



–దేవులపల్లి సారిక రమేశ్,
9963701294


# ఆహ్వానం

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ మరియు పాలపిట్ట బుక్స్ ఆధ్వర్యంలో

జాలాది రత్నసుధీర్ రచించిన కథాసంకలనం

## మనసు పలికిన ...



ఆవిష్కరణ సభ

సభాధ్యక్షత : శ్రీ.సి.ఎస్. రాంబాబు (కథారచయిత)

ముఖ్య అతిథి - ఆవిష్కర్త : ఆచార్య కొలకలూరి ఇనాక్ (పూర్వ ఉపకులపతి - శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం) పద్మశ్రీ పురస్కార గ్రహీత

ఆత్మీయ అతిథులు : శ్రీ.ఎ. దినకర బాబు, ఐఏఎస్. రిటైర్డ్
శ్రీ విహారి, రచయిత, విమర్శకులు
శ్రీ గుడిపాటి, ఎడిటర్, పాలపిట్ట, సాహిత్య మాసపత్రిక

వేదిక
రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్ (మొదటి అంతస్థు), హైదరాబాద్

సమయం : 21-07-2023, శుక్రవారం, సాయంత్రం 6.00 గంటలకు


Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.